# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 10 సంచిక : 14 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ శనివారం 19 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME 10 ISSUE :14 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA SAT 19 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# పోర్టు ఆధారిత అభివృద్ధిపై చంద్రబాబు ప్రత్యేక దృష్టి..

## ఒకేసారి 28 ప్రాజెక్టులు.. 20,000 ఉద్యోగాలు

- రూ.22,177 కోట్ల విలువైన 28 పారిశ్రామిక ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ఆమోదం
- ఈ ప్రాజెక్టుల ద్వారా సుమారు 19,739 మందికి కొత్తగా ఉపాధి అవకాశాలు
- ఏపీని హార్డ్‌వేర్, పోర్టు ఆధారిత పారిశ్రామిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యం
- ఎగుమతుల ర్యాంకింగ్‌లో దేశంలోనే 10వ స్థానంలో నిలిచిన తిరుపతి జిల్లా
- ఆమోదం పొందిన ప్రాజెక్టులను 6 నెలల్లో ప్రారంభించాలని సీఎం ఆదేశం



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టించే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన 21వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశంలో రూ.22,177.84 కోట్ల విలువైన 28 పారిశ్రామిక ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో కొత్తగా 19,739 మందికి ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. ఇంధన, ఐటీ, ఆహార శుద్ధి, తయారీ, పర్యాటక రంగాలకు చెందిన ఈ ప్రతిపాదనలతో రాష్ట్ర సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

**హార్డ్‌వేర్, పోర్టు ఆధారిత అభివృద్ధిపై ఫోకస్**

ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు రెండు ప్రధాన లక్ష్యాలపై అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. రాష్ట్రాన్ని దేశంలోనే కీలకమైన హార్డ్‌వేర్ తయారీ కేంద్రంగా (హబ్) తీర్చిదిద్దడంతో పాటు, తీర ప్రాంతాన్ని సద్వినియోగం చేసుకుంటూ పోర్టు ఆధారిత పారిశ్రామిక వ్యవస్థను (ఎకో సిస్టమ్) నిర్మించాలని ఆదేశించారు. సెమీ కండక్టర్లు, చిప్ తయారీ, రోబోటిక్స్ వంటి ఆధునిక రంగాల్లో భారీ పెట్టుబడులను ఆకర్షించాలని సూచించారు. కొప్పర్తి, తిరుపతి, లేపాక్షి ఎలక్ట్రానిక్స్ హబ్‌లలో పరిశోధన, డిజైన్, తయారీతో కూడిన పూర్తిస్థాయి ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఎలక్ట్రానిక్స్, హార్డ్‌వేర్ రంగాల్లో పెట్టుబడుల కోసం తైవాన్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు మంత్రి నారా లోకేశ్ తెలిపారు.

**నైపుణ్యాభివృద్ధి, ఎగుమతులే లక్ష్యం**

రాష్ట్రంలోని యువతకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. 10వ తరగతి నుంచే నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని, ఇందుకు స్కిల్ మ్యాపింగ్ నిర్వహించాలని సీఎం ఆదేశించారు. శ్రీసిటీ వంటి పారిశ్రామిక కేంద్రాల వల్ల తిరుపతి జిల్లా ఎగుమతుల ర్యాంకింగ్‌లో దేశంలోనే 10వ స్థానంలో, తూర్పుగోదావరి 12వ స్థానంలో నిలిచాయని, వీటిని టాప్-5కి తీసుకురావడమే లక్ష్యమని చంద్రబాబు పేర్కొన్నారు.మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు

- మిగతా 2లో



## ప్రతిభా కేంద్రాలుగా ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు..

## ఏఐ స్కిల్స్ తప్పనిసరి

### నారా లోకేశ్ ఆదేశాలు

- నిమ్మకూరులో ఐఐటీ-జేఈఈ/నీట్ అకాడమీ ఏర్పాటుకు ఆమోదం
- 10 రెసిడెన్షియల్ స్కూళ్లను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లుగా అభివృద్ధి చేయాలని నిర్ణయం
- విద్యార్థులకు ఏఐ స్కిల్స్‌తో పాటు కంప్యూటర్ ల్యాబ్స్ తప్పనిసరి
- సిబ్బంది పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం

- మిగతా 2లో

### అంబటి రాంబాబుకు ఈడీ నోటీసులు...

## విచారణకు రావాలంటూ ఫోన్ ద్వారా సమాచారం..



పెన్ పవర్ డెస్క్:మాజీ మంత్రి అంబటి రాంబాబుకు మరో షాక్ తగిలింది. విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేసింది ఈడీ. సెప్టెంబర్ 11వ తేదీనే నోటీసుకు పంపినట్లు

- మిగతా 2లో



## వైసీపీ హయాంలో ఏపీపీఎస్సీని స్కామ్‌గా మార్చారు

### 'జెన్ జీ' ఇంటరాక్షన్‌లో బుద్దా వెంకన్న

- విజయవాడలోని గాంధీజీ మహిళా కళాశాలలో జెన్ జీ ఇంటరాక్షన్
- వైసీపీ హయాంలో ఉద్యోగాల భర్తీలో అవకతవకలు జరిగాయన్న బుద్దా వెంకన్న
- వీటన్నింటిపై విచారణ జరిపి బాధ్యులను శిక్షిస్తామని వెల్లడి

- మిగతా 2లో

## చంద్రబాబు చేతుల మీదుగా.. నేడు విశాఖలో చారిత్రక ఘట్టం



- విశాఖలో 40 ఏళ్ల సమస్యకు కూటమి ప్రభుత్వం పరిష్కారం
- నేడు 28,445 కుటుంబాలకు ఇంటి పట్టాలు పంపిణీ చేయనున్న సీఎం చంద్రబాబు
- రూ.8,874 కోట్ల విలువైన 399 ఎకరాల భూమి క్రమబద్ధీకరణ
- ఇంటిపై పూర్తి హక్కు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్న ముఖ్యమంత్రి
- విశాఖ అభివృద్ధిలో పేదలను భాగస్వాములను చేస్తామని వెల్లడి

- మిగతా 2లో



## రాయలసీమ పౌరుషం ఏమిటో చూపిస్తాం

- సీమ ప్రాంత అభివృద్ధికి ప్రతిరూపంగా కొత్త పార్టీ రాబోతోందన్న విజయసాయిరెడ్డి
- టీడీపీ, వైసీపీ రెండూ కుటుంబ రాజకీయాలకే ప్రాధాన్యతనిచ్చాయని విమర్శ
- యువత భాగస్వామ్యంతో సీమను తిరిగి రతనాలసీమగా మారుస్తానని హామీ

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొత్త శకం ప్రారంభం కాబోతోందని, రాయలసీమ ప్రాంత అభివృద్ధి, స్థానిక ప్రజల ఆత్మగౌరవానికి ప్రతిరూపంగా

- మిగతా 2లో

## కేసీఆర్, హరీశ్ రావు భూములపై పూర్తి ఆధారాలు ఉన్నాయి



- కేసీఆర్ ఓవర్ లాప్ ల్యాండ్‌లో ఉన్నారన్న పొంగులేటి
- 2004లో ఒక ఎకరా మాత్రమే చూపించిన కేసీఆర్‌కు వందల కోట్ల భూములు ఎలా వచ్చాయని ప్రశ్న
- తమ గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఓవర్ లాప్ ల్యాండ్‌లో ఉన్నారని, సర్వే అనంతరం వ్యత్యాసాలు బయటపడితే ఆయనకు నోటీసులు ఇస్తామని తెలంగాణ రెవెన్యూ మంత్రి

- మిగతా 2లో

### నౌకను ఢీకొట్టి మాపైనే నిందలా?..

## పాక్ తీరుపై మండిపడ్డ భారత్



పెన్ పవర్ డెస్క్:అరేబియా సముద్రం అంతర్జాతీయ జలాల్లో భారత్-పాక్ యుద్ధ నౌకలు ఢీకొన్న ఘటనలో పాకిస్థాన్ చేస్తున్న ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. పాకిస్థాన్ ప్రత్యేక ఆర్థిక మండలిలో భారత నౌక రెచ్చగొట్టే, ఆమోదయోగ్యం కాని చర్యలకు పాల్పడిందని ఆ దేశ విదేశాంగశాఖ చేసిన ఆరోపణలు అసంబద్ధమైనవని స్పష్టం చేసింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. దాయాది దేశం తీరుపై మండిపడ్డారు."నౌకను ఢీకొట్టిన వ్యవహారంపై పాక్ రాయబారికి సమన్లు

- మిగతా 2లో



### దుగరాజపట్నంలో భారీ షిప్‌యార్డ్..

## రూ.15 వేల కోట్ల పెట్టుబడి!

- దుగరాజపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్
- ఎండీఎల్‌తో ఏపీ ప్రభుత్వ ఎంవోయూ
- ఐదేళ్లలో రూ.15 వేల కోట్ల పెట్టుబడి
- 45 వేల మందికి ఉపాధి అవకాశాలు
- ఏటా 12 లక్షల గ్రాస్ టన్నుల సామర్థ్యం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో షిప్‌బిల్డింగ్ రంగానికి భారీ ఊతం లభించనుంది. దుగరాజపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్ ఏర్పాటు చేసేందుకు 'మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్' (ఎండీఎల్)తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో సచివాలయంలో ఎండీఎల్, 'నేషనల్ షిప్‌బిల్డింగ్ అండ్ హెవీ ఇండస్ట్రీస్ పార్క్-ఏపీ' (ఎన్ఎస్‌హెచ్ఐపీ-ఏపీ) మధ్య ఎంవోయూ జరిగింది.వచ్చే ఐదేళ్లలో ఈ ప్రాజెక్టుపై ఎండీఎల్ సుమారు రూ.15 వేల కోట్లు పెట్టుబడి పెట్టనుంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 45 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. షిప్‌బిల్డింగ్‌తో పాటు మెరైన్ ఇంజినీరింగ్, లాజిస్టిక్స్, సర్వీసులు, అనుబంధ పరిశ్రమలు కూడా అభివృద్ధి చెందే అవకాశం ఉంది.ప్రతిపాదిత షిప్‌యార్డ్ ఏటా 12 లక్షల గ్రాస్ టన్నుల నౌకల నిర్మాణ సామర్థ్యంతో ఏర్పాటు కానుంది. ట్యాంకర్లు,

- మిగతా 2లో



## పాకిస్థాన్‌లో మసీదుపై ఆత్మాహుతి దాడి.. 15 మంది మృతి

- పాకిస్థాన్‌లోని కోహట్‌లో మసీదుపై ఉగ్ర దాడి
- ఈ ఘటనలో ఐదుగురు పోలీసులతో సహా 15 మంది మృతి
- 50 మందికి పైగా తీవ్ర గాయాలు, పలువురి పరిస్థితి విషమం
- పోలీసు కార్యాలయమే లక్ష్యంగా దాడి జరిగినట్లు అనుమానం
- ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థ బాధ్యత ప్రకటించలేదు

- మిగతా 2లో

## ఏఐని పూర్తిగా అదుపులో ఉంచే సాంకేతిక విజ్ఞానం ఇంకా రాలేదు

- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మానవ నియంత్రణలోనే ఉండాలి
- ఏఐ నియంత్రణకు అమెరికా, చైనా మధ్య ఒప్పందం కీలకం
- దేశాలు, కంపెనీలు తమ డేటాపై నియంత్రణ కలిగి ఉండాలి
- భారత్ ఏఐ మిషన్ అందరికీ అందుబాటులో ఉండాలన్న వినయ్ క్వాత్రా
- సియాటెల్‌లో భారత సంతతి టెక్ నిపుణులతో కీలక సమావేశం

- మిగతా 2లో





## నందిగ్రామ్‌లో అనూహ్య మలుపు..

### కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించిన మమత!

- నందిగ్రామ్ బరి నుంచి తప్పుకున్న మమత వర్గం అభ్యర్థి
- కాంగ్రెస్ అభ్యర్థికి పూర్తి మద్దతు ప్రకటించిన దీదీ
- ఇండియా కూటమి ఐక్యత కోసమే ఈ నిర్ణయమన్న మమత
- బీజేపీ ఒక జుమ్లా పార్టీ అని తీవ్ర విమర్శలు

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# నందిగ్రామ్‌లో అనూహ్య మలుపు.. కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించిన మమత!

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. నందిగ్రామ్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు తెలుపుతున్నట్లు మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించారు. తమ పార్టీ అభ్యర్థి నామినేషన్‌ను ఉపసంహరించుకున్న నేపథ్యంలో, బీజేపీకి వ్యతిరేకంగా 'ఇండియా' కూటమి ఐక్యతను చాటేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె స్పష్టం చేశారు.
ఉప ఎన్నికకు ఇంకా నెల రోజుల సమయం ఉండగానే, మమత నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అభ్యర్థి సంచితా ప్రధాన్ అనూహ్యంగా తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. ఈ పరిణామంతో తాము మరో అభ్యర్థిని బరిలోకి దించబోమని, కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రధాన్‌కు పూర్తిస్థాయిలో మద్దతిస్తామని మమతా బెనర్జీ వెల్లడించారు.ఈ సందర్భంగా మమత బెనర్జీ మాట్లాడుతూ, "మేము పోరాటానికి సిద్ధంగా ఉన్నాము. దేశం నుంచి బీజేపీని తరిమికొట్టడమే మా లక్ష్యం. ఇండియా కూటమికి మా పూర్తి సంఘీభావం ఉంటుంది" అని పేర్కొన్నారు. అంతకుముందు రోజు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తనకు ఫోన్ చేశారని, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ సైతం మద్దతు తెలుపుతూ సందేశం పంపారని ఆమె వివరించారు. ఇదే క్రమంలో బీజేపీని ఒక 'జుమ్లా పార్టీ'గా ఆమె అభివర్ణించారు.రాష్ట్ర సచివాలయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి సువేందు అధికారిని కలిసిన తర్వాత సంచితా ప్రధాన్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకోవడం గమనార్హం. కాగా టీఎంసీలోని రెండు వర్గాలకు ఎన్నికల సంఘం కొత్త గుర్తులను కేటాయించింది. మమత వర్గానికి 'ఫుట్‌బాల్ ప్లేయర్', ప్రత్యర్థి వర్గానికి 'ఎన్వలప్' గుర్తులను కేటాయించిన సంగతి తెలిసిందే.

## వైసీపీ హయాంలో ఏపీపీఎస్సీని స్కామ్‌గా మార్చారు

విజయవాడలోని గాంధీజీ మహిళా కళాశాలలో నిర్వహించిన 'జెన్ జీ – ఇంటరాక్షన్' కార్యక్రమంలో టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు బుద్దా వెంకన్న పాల్గొని విద్యార్థినులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మెగా డీఎస్సీ, ఏపీపీఎస్సీ నోటిఫికేషన్లపై విద్యార్థినులు అడిగిన పలు ప్రశ్నలకు, సందేహాలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని, గ్రూప్స్ నియామకాలతో సహా ఉద్యోగాల భర్తీని ఒక స్కామ్‌లా మార్చేసి బ్యాక్ డోర్ పద్ధతిలో తమ అనుచరులకు ఉద్యోగాలు ఇచ్చుకున్నారని మండిపడ్డారు. ఈ అక్రమాల వల్ల లక్షలాది మంది ప్రతిభావంతులైన నిరుద్యోగులు నష్టపోయారని, కూటమి ప్రభుత్వం వీటన్నింటిపై పూర్తిస్థాయి విచారణ జరిపించి బాధ్యులను కఠినంగా శిక్షిస్తుందని వెల్లడించారు.గత ప్రభుత్వ లోపాలను సరిదిద్దుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఏపీపీఎస్సీ వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నారని, భవిష్యత్తులో ప్రశ్నాపత్రాల లీకేజీలకు తావులేకుండా అత్యంత పారదర్శకమైన, ఆధునిక భద్రతా ప్రమాణాలతో కూడిన వ్యవస్థను రూపుదిద్దుతున్నారని బుద్దా వెంకన్న తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకం చేసిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియను ఎటువంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా, అభ్యర్థులకు సరిపడా సమయం కల్పిస్తూ సమర్థవంతంగా ముందుకు తీసుకెళుతున్నామని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ రంగంలో లక్షలాది ఉపాధి అవకాశాలను సృష్టించేందుకు అంతర్జాతీయ సంస్థలను రాష్ట్రానికి రప్పించేందుకు లోకేశ్ కృషి చేస్తున్నారని కొనియాడారు.

## ఏఐని పూర్తిగా అదుపులో ఉంచే సాంకేతిక విజ్ఞానం ఇంకా రాలేదు

వేగంగా విస్తరిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీ ఎల్లప్పుడూ మానవ నియంత్రణలోనే ఉండాలని, దీని కోసం ప్రభుత్వాలు, టెక్నాలజీ కంపెనీల మధ్య అంతర్జాతీయ స్థాయిలో బలమైన నిబంధనలు అవసరమని మైక్రోసాఫ్ట్ ఛైర్మన్, సీఈఓ సత్య నాదెళ్ల అన్నారు. ఈ ప్రక్రియలో అమెరికా, చైనా దేశాల మధ్య అవగాహన అనేది అత్యంత కీలకమైన తొలి అడుగని ఆయన స్పష్టం చేశారు.సెప్టెంబర్ 17న సియాటెల్‌లో జరిగిన 'ఐడియాస్ ఫర్ ఇండియా' ఫోరమ్‌లో ఆయన ప్రసంగించారు. ఏఐ రంగంలో శక్తివంతమైన ఆవిష్కరణలు వస్తున్నప్పటికీ, దాని నియంత్రణకు సంబంధించిన కీలక ప్రశ్నలకు సమాధానాలు ఇంకా లభించలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "ఏఐని పూర్తిగా అదుపులో ఉంచే సాంకేతిక విజ్ఞానం (సైన్స్ ఆఫ్ అలైన్‌మెంట్) మన వద్ద ఇంకా సిద్ధంగా లేదు. కానీ అత్యంత శక్తివంతమైన టెక్నాలజీ మాత్రం మన చేతిలో ఉంది. ఇది ఒక వాస్తవం" అని ఆయన వివరించారు.మానవాళికి సేవ చేయని, మనిషి నియంత్రణలో లేని ఏ టెక్నాలజీ అయినా నిష్ప్రయోజనమని సత్య నాదెళ్ల తేల్చిచెప్పారు. ఏఐ అభివృద్ధిలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొంటూనే, దాని వల్ల కలిగే ప్రయోజనాలను ప్రపంచానికి అందించాలని సూచించారు. అయితే, ఊహించని పరిణామాలను నివారించేందుకు నిరంతర ప్రయత్నాలు జరగాలని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా ప్రభుత్వాల పాత్ర గురించి మాట్లాడుతూ, ఏఐ పాలనలో తొలి అడుగు అమెరికా–చైనా మధ్య ఏకాభిప్రాయంతో కూడిన నిబంధనల రూపకల్పనే అని పునరుద్ఘాటించారు. అయితే ఈ చర్చల్లో ప్రపంచంలోని ఇతర దేశాలను కూడా భాగస్వాములను చేయాలని ఆయన అన్నారు. ఏఐని అభివృద్ధి చేస్తున్న కంపెనీలు, దేశాలు కలిసికట్టుగా ఉమ్మడి నిబంధనలు రూపొందించుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.దేశాలతో పాటు కంపెనీలకు కూడా తమ పరిజ్ఞానం, డేటాపై పూర్తి నియంత్రణ ఉండటం చాలా ముఖ్యమని నాదెళ్ల పేర్కొన్నారు. "దేశాలు తమ పరిజ్ఞానాన్ని తమ నియంత్రణలో ఉంచుకోవాలి" అని ఆయన అన్నారు. ఇలాంటి భద్రత, భరోసా ఉన్నప్పుడే దేశాలు, కంపెనీలు ఏఐ రంగంలో పూర్తిస్థాయిలో పాల్గొంటాయని, వేరొకరి సాంకేతిక ఆధిపత్యానికి లోబడకుండా ఉంటాయని వివరించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న అమెరికాలో భారత రాయబారి వినయ్ క్వాత్రా మాట్లాడుతూ, డేటా వినియోగం, మోడల్ ట్రైనింగ్ వంటి అంశాలపై ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. భారత్ ఏఐ మిషన్ అందరికీ అందుబాటులో ఉండేలా, పారదర్శకంగా, సురక్షితంగా, నమ్మకంతో కూడుకున్నదై ఉండాలని పునరుద్ఘాటించారు. భారత కాన్సులేట్ జనరల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 40 మందికి పైగా భారత సంతతికి చెందిన సీఈఓలు, టెక్నాలజీ అధికారులు పాల్గొన్నారు. ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, సెమీకండక్టర్లు వంటి పలు కీలక రంగాలపై చర్చించారు.

## అంబటి రాంబాబుకు ఈడీ నోటీసులు... విచారణకు రావాలంటూ ఫోన్ ద్వారా సమాచారం..

- మొదటి పేజి తరువాయి
ఆయనకు ఈడీ అధికారులు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే.. తనకు ఏ నోటీసులు అందలేదని ఈడీ అధికారులకు తెలిపారు అంబటి. విచారణకు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయనకు అధికారులకు స్పష్టం చేసినట్లు సమాచారం. పలు కేసుల్లో గతంలో అరెస్టైన అంబటికి ఈడీ నేరుగా నోటీసులు జారీ చేయడంపై చర్చనీయాంశంగా మారింది.అంబటి రాంబాబు సుమారు పలు కేసులకు సంబంధించి సుమారు 18 రోజుల పాటు రిమాండ్ లో ఉన్నారు. సీఎం చంద్రబాబుపై చేసిన అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఫిర్యాదుల ఆధారంగా పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆర్థిక లావాదేవీలకు సంబంధించి ఈడీ నోటీసులు జారీ చేయడం హాట్ టాపిక్ గా మారింది.ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా పోలీసులను కేంద్ర దర్యాప్తు సంస్థలను వాడుకుంటూ తమ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారంటూ మండిపడుతున్నారు వైసీపీ శ్రేణులు.

# చంద్రబాబు చేతుల మీదుగా.. నేడు విశాఖలో చారిత్రక ఘట్టం

విశాఖపట్నంలో దశాబ్దాలుగా నెలకొన్న ఒక జటిల సమస్యకు పరిష్కారం లభించింది. ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని, వాటిపై యాజమాన్య హక్కుల కోసం 40 ఏళ్లుగా ఎదురుచూస్తున్న వేలాది పేద, మధ్య తరగతి కుటుంబాల కల రేపు సాకారం కానుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం విశాఖపట్నం వేదికగా ఈ చారిత్రక కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. మొత్తం 28,445 కుటుంబాలకు రూ.8,874 కోట్ల విలువైన భూమిపై సంపూర్ణ హక్కులు కల్పిస్తూ పట్టాలను అందజేయనున్నారు.

**దశాబ్దాల సమస్యకు ఫుల్‌స్టాప్**

విశాఖ నగర పరిధిలోని అనేక ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాల్లో పేదలు ఇళ్లు నిర్మించుకుని దశాబ్దాలుగా నివసిస్తున్నారు. అయితే, ఆ ఇంటి స్థలంపై వారికి పూర్తి హక్కులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆస్తిని అమ్ముకోలేని, బదలాయించలేని పరిస్థితితో పాటు, భవిష్యత్తుపై భరోసా కరవైంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కూటమి ప్రభుత్వం నడుం బిగించింది. మొత్తం 399 ఎకరాల విస్తీర్ణంలోని 19,33,853 చదరపు గజాల భూమిని క్రమబద్ధీకరించి, ఆయా కుటుంబాలకు పూర్తి హక్కులు కల్పించేందుకు రంగం సిద్ధం చేసింది. విశాఖలో ఇంత భారీ స్థాయిలో భూముల క్రమబద్ధీకరణ చేపట్టి పట్టాలు పంపిణీ చేయడం ఇదే తొలిసారి.

**పేద కుటుంబాల కలను నిజం చేస్తున్నా: సీఎం చంద్రబాబు**

ఈ కార్యక్రమంపై ముఖ్యమంత్రి చంద్రబాబు 'ఎక్స్' వేదికగా స్పందించారు. "తమకంటూ పూర్తి హక్కులతో సొంతిల్లు ఉండాలనేది ప్రతి ఒక్క కుటుంబ కల. అలాంటి వేల మంది కలను నిజం చేసేందుకే విశాఖ వస్తున్నా" అని ఆయన పోస్ట్ చేశారు. ఇది కేవలం పట్టాల పంపిణీ కాదని, 28 వేల కుటుంబాలకు వారి నివాసాలపై పూర్తి హక్కు కల్పించే చరిత్రాత్మక సందర్భమని పేర్కొన్నారు. ఈ పట్టాతో ప్రతి కుటుంబానికి విలువైన ఆస్తి, భవిష్యత్తుకు భద్రత, పిల్లలకు వారసత్వ సంపదతో పాటు ఆత్మగౌరవం, భరోసా లభిస్తాయని సీఎం వివరించారు. దశాబ్దాలుగా ఎదురుచూసిన కుటుంబాల ఆనందం చూడటమే ప్రభుత్వానికి నిజమైన సంతృప్తి అని ఆయన అన్నారు.2014-19 మధ్య కాలంలో నాటి ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారానికి ప్రయత్నించి కొన్ని జీవోలను జారీ చేసినా, ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో అది పూర్తిస్థాయిలో ముందుకు సాగలేదు. మళ్ళీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లా సమీక్షల్లో ప్రజాప్రతినిధులు ఈ సమస్యను సీఎం దృష్టికి తీసుకురావడంతో, అభ్యంతరాలు లేని ప్రభుత్వ స్థలాల్లోని ఇళ్లను క్రమబద్ధీకరించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

**మండలాల వారీగా లబ్ధిదారులు**

ఈ క్రమబద్ధీకరణ ద్వారా గాజువాక నుంచి భీమిలి వరకు అనేక ప్రాంతాల కుటుంబాలు లబ్ధి పొందనున్నాయి. అత్యధికంగా విశాఖ రూరల్‌లో 9,261 కుటుంబాలు, గాజువాకలో 4,353, ములగాడలో 4,213, గోపాలపట్నంలో 3,253, పెందుర్తిలో 2,722, పెదగంట్యాడలో 1,910, మహారాణిపేటలో 1,235, సీతమ్మధారలో 668, భీమిలిలో 464, ఆనందపురంలో 349, పద్మనాభంలో 17 కుటుంబాలు ఈ ప్రయోజనం పొందనున్నాయి.

**సీఎం పర్యటన వివరాలు**

ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం ఉదయం 10.30 గంటలకు విశాఖకు చేరుకుంటారు. ముందుగా ఆర్‌కే బీచ్‌లో 'స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులు, మత్స్యకారులతో ముచ్చటిస్తారు. అనంతరం ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరిగే బహిరంగ సభలో పాల్గొని, లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తారు. కార్యక్రమం ముగిసిన తర్వాత తిరిగి అమరావతికి ప్రయాణమవుతారు.

## ప్రతిభా కేంద్రాలుగా ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు..

# ఏఐ స్కిల్స్ తప్పనిసరి

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలను (ఏపీఆర్ఎస్) ప్రతిభావంతులను తయారుచేసే అత్యుత్తమ కేంద్రాలుగా తీర్చిదిద్దాలని, మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా అంతర్జాతీయ ప్రమాణాలను నెలకొల్పాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో శుక్రవారం ఆయన అధ్యక్షతన ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ (ఝ్రా=జు×ూ) 59వ గవర్నింగ్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రెసిడెన్షియల్ విద్యావ్యవస్థను సమూలంగా బలోపేతం చేసే దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.ఈ సమావేశంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు అకడమిక్ ఎక్సలెన్స్‌పై దృష్టి సారించి, ప్రతిభావంతులను తయారు చేసే కేంద్రాలుగా మారాలి" అని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను తొలిసారిగా పత్రికా ప్రకటనల ద్వారా అభినందించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇప్పటివరకు రెసిడెన్షియల్ స్కూళ్లలో చదివిన వారిలో 27 మంది ఐఏఎస్‌లు, 20 మంది ఐపీఎస్‌లు, 13 మంది ఐఆర్ఎస్‌లు, నలుగురు ఐఎఫ్ఎస్‌లతో పాటు ఎందరో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని అధికారులు వివరించగా, మంత్రి లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు.

**కీలక నిర్ణయాలు ఇవే..**

టెక్నాలజీలో వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో నైపుణ్య శిక్షణను తప్పనిసరి చేయాలని, అన్ని స్కూళ్లలో అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 10 ఏపీఆర్ విద్యాసంస్థలను 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'లుగా అభివృద్ధి చేసే ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలిపింది. ఇప్పటికే తాడికొండ, కొడిగినహళ్లి పాఠశాలలు ఈ జాబితాలో ఉన్నాయి.
కృష్ణా జిల్లా నిమ్మకూరులోని ఏపీఆర్ జూనియర్ కళాశాలలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఐఐటీ–జేఈఈ/నీట్ అకాడమీని ఏర్పాటు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మరో 6 రెసిడెన్షియల్ స్కూళ్లను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు కూడా సమావేశం ఆమోదముద్ర వేసింది.

సిబ్బంది సంక్షేమం, మౌలిక వసతులపై దృష్టి

సిబ్బంది సంక్షేమానికి సంబంధించి కూడా పలు ముఖ్య నిర్ణయాలు తీసుకున్నారు. ఏపీ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సిబ్బంది పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచే ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలిపింది. గెస్ట్ ఫ్యాకల్టీ గౌరవ వేతనాలను ఇతర సొసైటీలతో సమానంగా పెంచడంతో పాటు, పీఈటీలను పీడీలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు అంగీకరించింది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయ, బోధనేతర సిబ్బంది నియామకాలకు స్టాఫింగ్ ప్యాట్రన్‌కు ఆమోదం తెలిపారు.అన్ని రెసిడెన్షియల్ స్కూళ్లలో శాశ్వత భవనాలు, మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని, ఆటోమేటెడ్ స్మార్ట్ కిచెన్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. విద్యార్థుల వైద్య అత్యవసర పరిస్థితుల కోసం లక్ష రూపాయల వరకు ఖర్చు చేసే అధికారాన్ని సొసైటీ సెక్రటరీకి కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. జగ్గంపేట నియోజకవర్గంలోని భూపతిపాలెం రెసిడెన్షియల్ స్కూల్‌ను ప్రపంచస్థాయి క్రీడా హబ్‌గా తీర్చిదిద్దే అవకాశాలను పరిశీలించాలని లోకేశ్ ఆదేశించారు.ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జే. శ్యామలరావు, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ రంజిత్ బాషా, ఉన్నత విద్యాశాఖ డైరెక్టర్ నారాయణ భరత్ గుప్తా, ఏపీఆర్ఈఐఎస్ కార్యదర్శి కృష్ణమోహన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పోర్టు ఆధారిత అభివృద్ధిపై చంద్రబాబు ప్రత్యేక దృష్టి..

- మొదటి పేజి తరువాయి
'వన్ ఫ్యామిలీ––వన్ ఎంట్రప్రెన్యూర్' విధానాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. వీటితో పాటు రేర్ ఎర్త్ మినరల్స్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకోవాలని చెప్పారు. ఆమోదం పొందిన ప్రాజెక్టులను కేవలం ఆరు నెలల వ్యవధిలో ప్రారంభించేలా పర్యవేక్షించాలని అధికారులకు గడువు విధించారు. ఈ సమావేశంలో మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్, పి. నారాయణ, ఇతర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**ఎస్ఐపీబీ ఆమోదం పొందిన 28 ప్రాజెక్టుల పూర్తి వివరాలు:**

1.క్లీన్ రెన్యూవబుల్ ఎనర్జీ హైబ్రిడ్ సిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ – కడప జిల్లా – రూ.950 కోట్ల పెట్టుబడి – 90 ఉద్యోగాలు.
2.సాయి బయోఎనర్జీ ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ లిమిటెడ్ – నంద్యాల జిల్లా – రూ.168.56 కోట్లు – 600 ఉద్యోగాలు.
3.ఎం. వెంకటరావు ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (వీఎ= టె్రావాంట్ జీఎ) – శ్రీ సత్యసాయి జిల్లా – రూ.3,078 కోట్లు – 1,300 ఉద్యోగాలు.
4.రిజాల్వెన్ టూ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ – కర్నూలు – రూ.980 కోట్లు –– 250 ఉద్యోగాలు.
5.ముత్తూట్ ఫిన్‌కార్ప్ లిమిటెడ్ – విశాఖపట్నం – రూ.100 కోట్లు – 2,400 ఉద్యోగాలు.
6.డెలాయిట్ –– విశాఖపట్నం – రూ.43.75 కోట్లు – 2,500 ఉద్యోగాలు.
7.ఫోటాన్‌కోర్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ – అమరావతి –– రూ.9 కోట్లు – 45 ఉద్యోగాలు.
8.వెరిడాటా హెల్త్ ఇంక్. –అమరావతి – రూ.4.5 కోట్లు –– 50 ఉద్యోగాలు.
9.క్వాన్‌ఫ్లుయెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ – అమరావతి – రూ.5 కోట్లు – 30 ఉద్యోగాలు.
10. ట్రైక్వాంటా ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ––అమరావతి –– రూ.35 కోట్లు – 175 ఉద్యోగాలు.
11. క్వాంటమ్ కోడాన్ ప్రైవేట్ లిమిటెడ్ – అమరావతి – రూ.167 కోట్లు – 126 ఉద్యోగాలు.
12. శ్రిష్టి క్వాంటమ్ ప్రైవేట్ లిమిటెడ్ – అమరావతి – రూ.100 కోట్లు –– 110 ఉద్యోగాలు.
13. ఆరోహక్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ – అమరావతి –– రూ.62 కోట్లు – 300 ఉద్యోగాలు.
14. గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ – మచిలీపట్నం –– రూ.8,000 కోట్లు –– 8,000 ఉద్యోగాలు (3,000 ప్రత్యక్ష, 5,000 పరోక్ష).
15. మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ – పల్నాడు – రూ.3,000 కోట్లు –– 2,000 ఉద్యోగాలు.
16. క్యాటర్‌పిల్లర్ ఇంక్. – శ్రీసిటీ, తిరుపతి – రూ.150 కోట్లు –– 80 ఉద్యోగాలు.
17. ఎంఏఎఫ్ క్లాతింగ్ ప్రైవేట్ లిమిటెడ్ –కుప్పం, చిత్తూరు –– రూ.215 కోట్లు – 2,560 ఉద్యోగాలు.
18. దాల్మియా సిమెంట్ – కడప – రూ.395.23 కోట్లు.
19. అగర్వాల్ ఫౌండ్రీస్ – నెల్లూరు – రూ.549 కోట్లు – 245 ఉద్యోగాలు.
20. శ్రీ వైభవ లక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ – నెల్లూరు – రూ.222.63 కోట్లు –– 300 ఉద్యోగాలు.
21. శ్రీ వసుధ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ – అనంతపురం – రూ.254.06 కోట్లు –– 350 ఉద్యోగాలు.
22. రావోక్స్ అగ్రిటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ – చిత్తూరు – రూ.1,388.14 కోట్లు – 1,000 ఉద్యోగాలు.
23. కెల్లాగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ –– శ్రీ సిటీ, సత్యవేడు – రూ.211.70 కోట్లు – 30 ఉద్యోగాలు.
24. ఎపిటోమ్ ఇండస్ట్రీస్ ఇండియా లిమిటెడ్ – నెల్లూరు – రూ.530.65 కోట్లు –– 238 ఉద్యోగాలు.
25. హిందుస్థాన్ కోకా–కోలా బెవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్ –– విజయనగరం, తిరుపతి – రూ.1,127 కోట్లు –– 195 ఉద్యోగాలు.
26. గ్రాండ్ తిరుపతి హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ –– తిరుపతి – రూ.188.11 కోట్లు – 851 ఉద్యోగాలు.
27. సదరన్ గ్లోబ్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ లిమిటెడ్ – అమరావతి – రూ.167 కోట్లు – 600 ఉద్యోగాలు.
28. జేఎల్ అసోసియేట్స్ –– కడప – రూ.53.25 కోట్లు – 314 ఉద్యోగాలు.

## దుగరాజపట్నంలో భారీ షిప్‌యార్డ్.. రూ.15 వేల కోట్ల పెట్టుబడి!

- మొదటి పేజి తరువాయి
బల్క్ క్యారియర్లు, కంటైనర్ నౌకలు, ఎల్ఎన్‌జీ క్యారియర్లు, భారీ ప్రత్యేక నౌకలను ఇక్కడ నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. అవసరాన్ని బట్టి భవిష్యత్‌లో సామర్థ్యాన్ని మరింత పెంచుకునే అవకాశం ఉంటుంది. దుగరాజపట్నంలో షిప్‌బిల్డింగ్–కమ్–పోర్ట్ క్లస్టర్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. టెక్నో–ఎకనామిక్ ఫీజిబిలిటీ రిపోర్ట్ ప్రకారం షిప్‌బిల్డింగ్, షిప్ రిపేర్ యార్డ్‌కు సుమారు రూ.29,254 కోట్లు, పోర్టు అభివృద్ధికి రూ.9,513 కోట్ల వ్యయం అవుతుందని అంచనా.

## పాకిస్థాన్‌లో మసీదుపై ఆత్మాహుతి దాడి.. 15 మంది మృతి

పాకిస్థాన్‌లో ఉగ్రవాదులు మరోసారి రక్తపాతం సృష్టించారు. వాయవ్య పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్, కోహట్ నగరంలో శుక్రవారం ఓ మసీదును లక్ష్యంగా చేసుకుని ఆత్మాహుతి దాడికి పాల్పడ్డారు. ఈ ఘోర ఘటనలో ఐదుగురు పోలీసు అధికారులతో సహా కనీసం 15 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 56 మంది తీవ్రంగా గాయపడ్డారు.పోలీసు కార్యాలయాల సముదాయానికి సమీపంలో ఉన్న మసీదులోకి ఓ ఉగ్రవాది పేలుడు పదార్థాలతో కూడిన వాహనంతో దూసుకెళ్లాడు. ఈ భారీ పేలుడు ధాటికి మసీదు కుప్పకూలగా, సమీపంలోని పోలీసు భవనం ప్రహరీ గోడ సైతం నేలమట్టమైంది. అనంతరం, తుపాకులతో సాయుధులైన మరో ఇద్దరు ఉగ్రవాదులు పోలీసు ప్రాంగణంలోకి చొరబడేందుకు ప్రయత్నించారు. అయితే, అప్రమత్తమైన భద్రతా సిబ్బంది వెంటనే ఎదురుకాల్పులు జరపడంతో ఓ ఉగ్రవాది హతమయ్యాడు.గాయపడిన వారిలో అధికశాతం ప్రార్థనల కోసం వచ్చినవారేనని, వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు వెల్లడించారు. ఈ కిరాతక దాడిని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆ దేశ అధ్యక్షుడు ఆకాంక్షించారు.
పొరుగునే ఉన్న హంగూ జిల్లాలో గురువారం జరిగిన బాంబు దాడిలో ఆరుగురు సైనికులు మరణించిన మరుసటి రోజే ఈ దారుణం జరగడం కలకలం రేపుతోంది. ఇటీవల కాలంలో పాకిస్థానీ తాలిబన్లు (టీటీపీ) భద్రతా దళాలు, పౌరులను లక్ష్యంగా చేసుకుని దాడులను ముమ్మరం చేశారు. కాగా, తాజా దాడికి సంబంధించి ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థ బాధ్యత ప్రకటించలేదు.

## కేసీఆర్, హరీశ్ రావు భూములపై పూర్తి ఆధారాలు ఉన్నాయి

- మొదటి పేజి తరువాయి
పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. 2004 ఎన్నికల అఫిడవిట్‌లో కేవలం ఒక ఎకరం భూమి మాత్రమే ఉందని చూపించిన కేసీఆర్‌కు వందల కోట్ల విలువైన భూములు ఎక్కడి నుంచి వచ్చాయని నిలదీశారు. తమ భూముల కోసం వచ్చిన దళితులను నిలబెట్టి పసుపు నీళ్లు చల్లించిన చరిత్ర కేసీఆర్ కుటుంబానిదని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.మాజీ మంత్రి హరీశ్ రావుపై కూడా పొంగులేటి కీలక వ్యాఖ్యలు చేశారు. వట్టినాగులపల్లి భూమిపై హరీశ్ రావు మాటలు మార్చుతున్నారని, ట్రస్ట్ పేరిట భూములను దారి మళ్లించారని ఆరోపించారు. ఇరిగేషన్ మంత్రిగా ఉన్న సమయంలో రంగనాయక్ సాగర్ ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్న 13 ఎకరాల భూమిని డిలీట్ చేయించి, అతి తక్కువ ధరకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. అంతేకాకుండా రూ. 5.40 కోట్ల ప్రభుత్వ నిధులతో ఆ ల్యాండ్‌కు ప్రయోజనం చేకూరేలా రోడ్డు వేయించుకున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తమ వ్యాపార కుటుంబాలపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదన్న మంత్రి, ఈ భూ అక్రమాలకు సహకరించిన అధికారులు ఎంతటివారైనా సరే వారిపై కఠిన చర్యలు ఉంటాయని, సిద్దిపేటలో ఆక్రమణకు గురైన భూముల్లో 'ఇందిరమ్మ టవర్స్' నిర్మిస్తామని స్పష్టం చేశారు.

### నౌకను ఢీకొట్టి మాపైనే నిందలా?..

## పాక్ తీరుపై మండిపడ్డ భారత్

- మొదటి పేజి తరువాయి
జారీ చేసిన అనంతరం ఆ దేశ ప్రతిస్పందన చూశాం. భారత్‌పై నిందలు వేసేందుకు చేసిన వారి ప్రయత్నాలన్నీ ముందస్తుగా ఊహించినవే. వారి ఆరోపణలను తిరస్కరిస్తున్నాం. ప్రమాదకర విన్యాసాలు, కసరత్తులు చేసి.. 1991లో భారత్–పాక్ చేసుకున్న ఒప్పందంలోని అంశాలను పాక్ ఉల్లఘించింది. సముద్రంలో ఢీకొనడాన్ని నిరోధించే అంతర్జాతీయ నిబంధనలను సైతం పాటించకుండా తీవ్ర ఉల్లంఘనలకు పాల్పడింది" అని జయస్వాల్ స్పష్టం చేశారు. అయితే, ఈ ఘటనలో భారత నౌకాదళానికి చెందిన యుద్ధనౌక ఐఎన్ఎస్ కోల్‌కతా (×చీూ ఖశీశ్రీఎఞ్ఘు)కు పెద్దగా నష్టం జరగలేదని, ప్రస్తుతం సముద్రంలోనే ఉందన్నారు.

## రాయలసీమ పౌరుషం ఏమిటో చూపిస్తాం

- మొదటి పేజి తరువాయి
త్వరలోనే నూతన ప్రాంతీయ రాజకీయ పార్టీ రాబోతోందని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వెల్లడించారు. అనంతపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, టీడీపీ, వైసీపీ రెండూ కుటుంబ రాజకీయాలకే ప్రాధాన్యమిచ్చాయని... అసలైన రాయలసీమ పౌరుషాన్ని, ప్రాంతీయ సంక్షేమాన్ని కాపాడే బాధ్యతను తమ నూతన పార్టీ తీసుకుంటుందని స్పష్టం చేశారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులవుతున్నా రెడ్డి కార్పొరేషన్‌ను ఎందుకు పునరుద్ధరించలేదని ఆయన నిలదీశారు. రాష్ట్ర విభజన అనంతరం సీమ ప్రాంతానికే చెందిన నాయకులు ముఖ్యమంత్రులుగా పనిచేసినప్పటికీ, రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు, అభివృద్ధి పనులను నిర్లక్ష్యం చేశారని దుయ్యబట్టారు. చంద్రబాబు, జగన్ కుటుంబాలు కేవలం ఎన్నికల సమయంలోనే రాజకీయం చేస్తూ, సీమ నుంచి ప్రజల వలసలకు ప్రధాన కారణమయ్యారని ఆరోపించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే యువత భాగస్వామ్యంతో సీమను తిరిగి 'రతనాల సీమ'గా మారుస్తామని... అన్ని కులాలు, మతాల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని అన్నారు

# 104 వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి

ప్రభుత్వ వైద్యాధికారి నరేష్



**గండేపల్లి,పెన్ పవర్, సెప్టెంబర్ 18:** గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 104 మొబైల్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిందని ప్రభుత్వ వైద్యాధికారి నరేష్ తెలిపారు. ప్రతి నెలా ఆయా గ్రామాల సబ్ సెంటర్ల వద్ద 104 వాహనం ద్వారా అందించే వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.
మండల పరిధిలోని మల్లేపల్లి సబ్ సెంటర్ వద్ద శుక్రవారం 104 వాహనం ద్వారా నిర్వహించిన వైద్య సేవల కార్యక్రమంలో వైద్యాధికారి నరేష్ పాల్గొని రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 104 వాహనం ద్వారా వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన మందులను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలు తమ ఆరోగ్య సమస్యలకు సకాలంలో వైద్య సేవలు పొందేందుకు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారిణి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# ప్రజా ఫిర్యాదులను అత్యంత పగడ్బందీగా పరిష్కరించాలి..






- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్
- పెద్దాపురంలలో నిర్వహించిన ఒక నెల -ఒక గ్రామం నాలుగు సందర్శనలు కార్యక్రమాని 59 అర్జీలు..

**పెద్దాపురం.. పెన్ పవర్.. సెప్టెంబర్.18.** ఒక నెల -ఒక గ్రామం నాలుగు సందర్శనలు కార్యక్రమం కింద అందిన అర్జీలను అత్యంత పగడ్బందీగా,ప్రత్యేక దృష్టి తో పరిష్కారంచాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం పెద్దాపురం నియోజకవర్గం స్థాయిలో పెద్దాపురం మండలం ఎంపీడీవో నిర్వహించిన 'ఒక నెల – ఒక గ్రామం – నాలుగు సందర్శనలు' కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్.. ఇతర అధికారులతో కలిసి పాల్గొని, ప్రజల నుంచి దరఖాస్తులు, అర్జీలను స్వయంగా స్వీకరించారు.ఈ కార్యక్రమానికి డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామ స్వామి,పౌరసరఫరాల సంస్థ సభ్యులు తుమ్మల పద్మజ లక్ష్మి ఇతర ప్రజా ప్రతినిధులుహాజరైయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి నెలా ఒక నియోజకవర్గం చొప్పున నాలుగు సార్లు శుక్రవారం ఆ నియోజక వర్గంలో పీజీఆర్ఎస్ కార్యక్రమంనిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఇందులో భాగంగా పెద్దాపురం నియోజక వర్గ స్థాయిలో ఒక నెల -ఒక గ్రామం నాలుగు సందర్శనలు కార్యక్రమాన్ని వరుసగా మూడో వారం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమం కింద అందిన అర్జీల పట్ల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి,అత్యంత పకడ్బందీగాపరిష్కరించాలన్నారు. వివిధ శాఖలను నమోదు అయిన అర్జీలను క్షేత్రస్థాయిలో పూర్తి స్థాయి విచారణ జరిపి ప్రజా సమస్యలకు పూర్తి పరిష్కారం చూపేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ వారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో దాదాపు 59 అర్జీలు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. ఇవన్నీ కూడా ప్రధానంగా భూవివాదాలు, రీసర్వేలో గతంలో జరిగిన సమస్యలు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, రోడ్లు, తాగు నీరు,వ్యవసాయం అంశాల పై వచ్చాయన్నారు. వీటితోపాటు గత రెండు వారాలుగా నమోదైన వాటన్నింటినీ అధికారులు క్షేత్రస్థాయికి స్వయంగా వెళ్లి, అక్కడ ఉన్న వాస్తవ పరిస్థితులు తెలుసుకొని ప్రజలు సంతృప్తి స్థాయి పెంచేలా తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం ఎంపీడీవో కెవీ. సూర్యనారాయణ, తహసీల్దార్ పి.శ్రీనివాసు, నియోజకవర్గంలోని ఇతర మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు, డివిజన్, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# సచివాలయ సేవలకు దూరమైన కే.గోపాలపురం!

**చిన్న గ్రామమన్న కారణంతో పొరుగు గ్రామాల చుట్టూ ప్రదక్షిణలు**

**6 నుంచి 10 కిలోమీటర్లు ప్రయాణం.. పని దినం కోల్పోతున్న కూలీలు, రైతులు**

**తమ గ్రామంలోనే సచివాలయ సేవలు అందించాలని ప్రజల విజ్ఞప్తి**





**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 18:** తరాలు మారుతున్నా.. తమ గ్రామ ప్రజల తలరాత మాత్రం మారడం లేదని కే.గోపాలపురం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంప్యూటర్ యుగంలోకి అడుగుపెట్టినా ప్రభుత్వ సచివాలయ సేవల కోసం మాత్రం పొరుగు గ్రామాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొనడం తమ దురదృష్టమని వాపోతున్నారు.గండేపల్లి మండలంలోని కే.గోపాలపురం గ్రామంలో సుమారు 1,771 మంది జనాభా ఉండగా, 1,519 మంది ఓటర్లు ఉన్నారు. అయితే 3,000 మందికి పైగా జనాభా ఉన్న గ్రామాలకే సచివాలయ సేవలు ఏర్పాటు చేసే నిబంధన కారణంగా తమ గ్రామానికి ప్రత్యేక సచివాలయ సేవలు అందుబాటులో లేకుండా పోయాయని గ్రామస్తులు చెబుతున్నారు.
కే.గోపాలపురం గ్రామం పరిపాలనా పరంగా ఎన్‌టీ రాజాపురం, మల్లేపల్లి గ్రామాలతో అనుసంధానమై ఉండటంతో వివిధ ప్రభుత్వ సేవల కోసం అక్కడికి వెళ్లాల్సి వస్తోంది. కే.గోపాలపురం నుంచి ఎన్‌టీ రాజాపురానికి సుమారు 6 కిలోమీటర్లు, మల్లేపల్లికి సుమారు 10 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని ప్రజలు చెబుతున్నారు. సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో ద్విచక్ర వాహనాలు లేదా ఇతర మార్గాలపై ఆధారపడాల్సి వస్తోందని పేర్కొంటున్నారు.


### పని మానుకుని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాం

కూలి పనులు చేసుకుని జీవనం సాగించే తమలాంటి వారికి ఒక్కరోజు పని పోవడం కూడా తీవ్ర నష్టమేనని గ్రామస్తులు అంటున్నారు. సచివాలయ సేవ కోసం పొరుగు గ్రామానికి వెళ్లి, అక్కడ అధికారి అందుబాటులో లేకపోతే మరోసారి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గురువారం ఉదయం కే.గోపాలపురానికి చెందిన ముగ్గురు రైతులు పట్టాదారు పాస్ పుస్తకానికి సంబంధించిన పనిపై మల్లేపల్లి సచివాలయంలోని రెవెన్యూ విలేజ్ ఆఫీసర్‌ను కలిసేందుకు వెళ్లారు. అయితే అధికారి అందుబాటులో లేకపోవడంతో కార్యాలయం వద్దే నిరీక్షించాల్సి వచ్చింది. ఇలాంటి పరిస్థితులు తమకు తరచూ ఎదురవుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు.

### గ్రామంలోనే సేవలు అందించాలని డిమాండ్

ప్రభుత్వ సేవలు ప్రజల చెంతకే చేరాలనే లక్ష్యంతో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసినప్పటికీ, తమ గ్రామ ప్రజలు మాత్రం ఇప్పటికీ సేవల కోసం పొరుగు గ్రామాలకు పరుగులు తీయాల్సి వస్తోందని వారు పేర్కొంటున్నారు.
కే.గోపాలపురం గ్రామ జనాభా, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తమ గ్రామంలోనే సచివాలయ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ సమస్యను అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వానికి నివేదించి తగిన పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# స్పందించిన అధికారులు



మల్లేపల్లి సచివాలయంలో విద్యుత్ వైర్లు మార్పు


**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 18:** డేంజర్ గా మల్లేపల్లి సచివాలయం ప్రమాదకరంగా మారిందంటూ 'పెన్ పవర్'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం డేంజర్ తోను గా మల్లేపల్లి అన్న పెన్ పవర్ లో కథనానికి అధికారులు స్పందించారు. స్థానిక ఎంపీడీవో హరికృష్ణ సత్యారెడ్డి శుక్రవారం సచివాలయాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లను వెంటనే తొలగించాలని, సురక్షితమైన వైర్లను వినియోగించాలని పంచాయతీ కార్యదర్శి కి సిబ్బందికి సూచించారు. అనంతరం స్వయంగా దగ్గరుండి సర్వీస్ వైర్‌ను కొత్తదానితో మార్పించారు. దీంతో సచివాలయ ఉద్యోగులు, లబ్ధిదారులు ఊపిరి పీల్చుకున్నారు.


పెన్ పవర్
డేంజర్ జోన్‌గా మల్లేపల్లి సచివాలయం!
రక్షణ లేకుండా వేలాడుతున్న విద్యుత్ వైర్లు
ప్రాణభయంతో సచివాలయానికి వస్తున్న లబ్ధిదారులు
అధికారుల నిర్లక్ష్యమే కారణమంటున్న ప్రజలు
epaper.penpower.in | 2026-09-18 | Page: 3

# రావులపాడులో ఇరిగేషన్ స్థలం డంపింగ్ యార్డ్‌గా మార్పు







- చెత్తాచెదారం, దుర్వాసనతో ప్రజల అవస్థలు.. కాలువ కలుషితంపై ఆందోళన
- పచ్చదనం, పరిశుభ్రత పేరుతో గ్రామ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నా..
- మరోవైపు ఇరిగేషన్ స్థలంలో పేరుకుపోతున్న చెత్తపై ప్రజల ఆగ్రహం

**రావులపాలెం, పెన్ పవర్ సెప్టెంబర్ 18:** రావులపాలెం మండలం రావుల పాడు గ్రామంలో కాలువ గట్టుపై ఉన్న ఇరిగేషన్ స్థలం చెత్తాచెదారం పేరుకుపోయి డంపింగ్ యార్డ్‌గా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ, ప్రధాన రహదారికి సమీపంలో చెత్తను ఇష్టారాజ్యంగా వేయడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చెత్తకుప్పల నుంచి వెదజల్లుతున్న దుర్వాసనతో అటుగా వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు, భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోతున్నారు.

### కాలువలోకి ప్లాస్టిక్ వ్యర్థాలు.. సాగునీటి కలుషితంపై ఆందోళన

కాలువ గట్టు పక్కనే చెత్తను పోగు చేయడంతో ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర కలుషిత పదార్థాలు కాలువలోకి చేరే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలువ ద్వారా రెండు లక్షలకు పైగా ఎకరాలకు సాగునీరు అందుతుందని వారు పేర్కొంటున్నారు. కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త పేరుకుపోవడం వల్ల నీటి నాణ్యత దెబ్బతిని దిగువ ప్రాంతాల ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడే ప్రమాదం ఉందని చెబుతున్నారు. సాగునీటి వనరులను పరిశుభ్రంగా ఉంచాల్సిన సమయంలో ఇరిగేషన్ స్థలాన్ని చెత్త నిల్వ కేంద్రంగా మార్చడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.

### వాడపల్లి ఆలయానికి వెళ్లే భక్తులకు ఇబ్బందులు

ప్రముఖ పుణ్యక్షేత్రమైన వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయానికి కాలినడకన వెళ్లే భక్తులకు రావుడుపాడు మీదుగా వెళ్లే మార్గం సులభంగా ఉంటుందని స్థానికులు తెలిపారు. అయితే కాలువ గట్టు వద్ద పేరుకుపోయిన చెత్త నుంచి తీవ్రమైన దుర్వాసన వస్తుండటంతో భక్తులు ముక్కులు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, ఇతర ప్రయాణికులు ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు.

### చెత్తను తగలబెట్టడంతో వాయు కాలుష్యం

చెత్త పేరుకుపోయిన ప్రతిసారీ దానిని తగలబెట్టడం వల్ల పొగ, దుర్వాసనతో వాయు కాలుష్యం పెరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రహదారి వెంట ప్రయాణించే వాహనదారులు, సమీప ప్రాంతాల ప్రజలు పొగతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చడం వల్ల పర్యావరణానికి హాని కలిగే అవకాశం ఉన్నందున అధికారులు దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

### అధికారులు స్పందించాలని ప్రజల డిమాండ్

పరిశుభ్రత, పచ్చదనం పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్న గ్రామపంచాయతీ అధికారులు, ఇరిగేషన్ శాఖ సిబ్బంది ఈ సమస్యపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇరిగేషన్ స్థలంలో పేరుకుపోయిన చెత్తను పూర్తిగా తొలగించి, కాలువను శుభ్రపరచాలని కోరుతున్నారు. చెత్తను కాలువ గట్టు వద్ద వేయకుండా ప్రత్యామ్నాయ వ్యర్థాల నిర్వహణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.
ప్రజల ఆరోగ్యం, సాగునీటి వనరుల పరిరక్షణ, భక్తులు మరియు ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇకనైనా ఇరిగేషన్ అధికారులు, గ్రామపంచాయతీ యంత్రాంగం సమన్వయంతో చర్యలు చేపట్టి రావుడుపాడు కాలువ గట్టును పరిశుభ్రంగా, ప్రజలకు ఇబ్బందులు లేని మార్గంగా తీర్చిదిద్దాలని డిమాండ్ చేస్తున్నారు.

# వీఆర్ఏల సమస్యలపై ప్రభుత్వం తక్షణం స్పందించాలి

- మూడో రోజూ కొనసాగిన సమ్మె.. పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్
- అర్హులైన వీఆర్ఏలకు వీఆర్వో పోస్టులు కల్పించాలని విజ్ఞప్తి




**కాజులూరు, పెన్‌పవర్, సెప్టెంబర్ 18:** ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, వీఆర్ఏలకు జీతాలు పెంచడంతో పాటు పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామ రెవెన్యూ సహాయకులు చేపట్టిన సమ్మె శుక్రవారం కాజులూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద మూడో రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా వీఆర్ఏలు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం మండల అధ్యక్షుడు వినకోటి సత్యనారాయణ మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో రెవెన్యూ పరిపాలనలో వీఆర్ఏలు కీలకమైన విధులు నిర్వహిస్తున్నప్పటికీ, ఏళ్లుగా తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంబాధాకరమన్నారు.వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేసి ఆర్థిక భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణలో వీఆర్ఏలకు అమలు చేస్తున్న విధంగా పే స్కేల్ సదుపాయాన్ని తమకు కూడా వర్తింపజేయాలని కోరారు.అర్హులకు వీఆర్వో పోస్టులు కల్పించాలి

నామినీలుగా పనిచేస్తున్న వారితో పాటు ఆన్‌లైన్ సెటిల్‌మెంట్ వీఆర్ఏలుగా విధులు నిర్వహిస్తున్న అర్హులను గుర్తించి, వారి సేవలను పరిగణనలోకి తీసుకుని తగిన విధంగా నియామకాలు చేపట్టాలని సత్యనారాయణ కోరారు. అర్హత కలిగిన వీఆర్ఏల్లో 70 శాతం మందిని వీఆర్వోలుగా నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు అండగా నిలవాలి విధి నిర్వహణలో మృతిచెందిన వీఆర్ఏల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఆయా కుటుంబాల్లో అర్హత ఉన్న ఒకరికి వయసుతో సంబంధం లేకుండా ఉద్యోగ అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తమ సేవలను ప్రభుత్వం గుర్తించి, ఉద్యోగ భద్రతతో పాటు తగిన వేతనాలు, పదోన్నతి అవకాశాలు కల్పించాలని కోరారు.వీఆర్ఏల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, సంఘం నాయకులతో తక్షణమే చర్చలు జరిపి పరిష్కారం చూపాలని వినకోటి సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు తమ ఆందోళనను కొనసాగిస్తామని వీఆర్ఏలు తెలిపారు.కార్యక్రమంలో వీఆర్ఏలు వాసంశెట్టి సుబ్బారావు,తాతపూడి రాజు, ఎం.వెంకటరమణ,లంక రవికుమార్,ప్రసాద్,విష్ణు, భవాని,సాయిలక్ష్మి,వీర్రాజు, చంద్రశేఖర్,పద్మ, వెంకటేశ్వరరావు,ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవాలు

పౌష్టికాహారం, రక్తహీనత నిర్మూలనపై అవగాహన



**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 18:** కొత్తపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ఎ. గౌతమి లక్ష్మి ఆధ్వర్యంలో వాడపల్లి వాటర్ ట్యాంక్ అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. సెప్టెంబర్ 16 నుంచి 21వ తేదీ వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా 'మన అంగన్వాడి.. మన బాధ్యత' అనే అంశంపై అవగాహన కల్పించారు.కార్యక్రమానికి ఆర్జేడీ బి. సుజాత రాణి, సీడీపీవో ఎ. గౌతమి లక్ష్మి, సూపర్‌వైజర్ కె. పద్మావతి హాజరయ్యారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం ప్రాధాన్యతను వివరించారు. చిరుధాన్యాలు, పాలు, గుడ్లు, పండ్లు, కూరగాయలు, మునగాకు వినియోగంతో పాటు రక్తహీనత నివారణపై అవగాహన కల్పించారు.అంగన్వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం ఆహారం అందించడం, వంటశాల పరిశుభ్రత, ఆహార భద్రతపై సూచనలు చేశారు. ఏఎన్ఎంలు, ఎంసీహెచ్ సిబ్బంది, మహిళలు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పోషణ మాస ప్రతిజ్ఞ చేయించారు. అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో ఆదిత్య విద్యార్థి ప్రతిభ




**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 18:** శ్రీ రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో కాకినాడ లక్ష్మీనారాయణ నగర్‌లోని ఆదిత్య డిగ్రీ అండ్ పీజీ కళాశాల విద్యార్థిని పి.సారిక ప్రియ ప్రతిభ కనబరిచింది. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఈ పోటీల్లో నాలుగో స్థానాన్ని సాధించి నగదు బహుమతితో పాటు స్వామి వివేకానంద సాహిత్యం, ప్రశంసా పత్రాన్ని అందుకుంది. విశాఖపట్నం శ్రీ రామకృష్ణ మిషన్ ఆశ్రమం ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు "దేశ నిర్మాణంలో మహిళా సాధికారతపై స్వామి వివేకానంద" అనే అంశంపై రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 6 వేలకు పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాల నుంచి 150 మంది విద్యార్థులు పాల్గొనడం విశేషం.ఈ సందర్భంగా కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు మాట్లాడుతూ.. అత్యధిక సంఖ్యలో విద్యార్థులను పోటీలకు సిద్ధం చేసిన తెలుగు డీన్ తేజేశ్వరరావును, నాలుగో స్థానంలో నిలిచిన పి.సారిక ప్రియను అభినందించారు. విద్యార్థులు స్వామి వివేకానంద సాహిత్యాన్ని చదవడం ద్వారా వ్యక్తిత్వ వికాసంతో పాటు దేశభక్తి భావాలను పెంపొందించుకోవచ్చని అన్నారు.విజేత పి.సారిక ప్రియను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సి.సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డి.అశ్విని, అధ్యాపకులు అభినందించారు.

## వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి.

- మూడవ రోజుకు చేరిన శాంతియుత నిరసన.



**ఆలమూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 18:** వీఆర్ఏల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆలమూరు మండల వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు తాతపూడి ఇస్సాక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన ఆలమూరు తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న ధర్నా చౌక్ వద్ద వీఆర్ఏల సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న శాంతియుత ఉద్యమం మూడవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆలమూరు మండలంలో గల పలు గ్రామాల్లో వీఆర్ఏలు గ్రామస్థాయిలో రెవెన్యూ శాఖ విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. తొమ్మిదేళ్లుగా రూ.10,500 వేతనంతో ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్ఏ లందరికీ తెలంగాణ తరహాలో పే స్కేల్ అమలు చేయాలని, నామినీగా పనిచేస్తున్న వారందరినీ వీఆర్ఏలుగా నియమించాలని, అర్హులైన వీఆర్ఏ లందరికీ 70 శాతం పదోన్నతి కల్పించాలని, మరణించిన వీఆర్ఏ కుటుంబాలలో ఒకరికి కారుణ్య నియామకం క్రింద ఉద్యోగం ఇవ్వాలని, పేద ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి న్యాయం చేయాలని కోరారు. వీఆర్ఏల శాంతియుత ఉద్యమాలను గుర్తించి న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో వీఆర్ఏలందరూ ఐక్యంగా కదిలి ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ కంతేటి శివరామారావు, ఉపాధ్యక్షుడు భువనగిరి యేసు, ట్రెజరర్ కుండేటి శ్రీను, గునపల్లి నాగేశ్వరరావు, సిద్దిల చంటిబాబు మండలం పరిధిలోని వీఆర్ఏలు పాల్గొన్నారు.

## పెదపళ్ళలో సామూహిక లక్ష్మీ గణపతి పూజ, గరిక అర్చనలు




**ఆలమూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 18:** గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెదపళ్ళ బాలగణపతి దేవాలయంలో శుక్రవారం సామూహిక లక్ష్మీ గణపతి పూజ, విశేష గరిక అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పెదపూడి సత్యనారాయణాచారులు(సత్తిబాబు), సంతోష్ ల ఆధ్వర్యంలో మహిళలు అధిక సంఖ్యలో ఈ పూజల్లో పాల్గొన్నారు. వేదోక్తంగా పూజలు నిర్వహించారు. గణేశునికి అత్యంత ప్రీతిపాత్రమైన దూర్వాయుగ్మంతో పూజ వల్ల గణపతి అనుగ్రహం సిద్ధిస్తుందని అర్చకులు తెలిపారు.

## ఆదిత్య యూనివర్సిటీలో ఐఓటీపై వర్క్‌షాప్



**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 18**: ఆదిత్య యూనివర్సిటీలో ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో మూడో సంవత్సరం విద్యార్థులకు లి'ఐఓటీ అండ్ ఎంబెడెడ్ సిస్టమ్స్'లిపై వర్క్‌షాప్ నిర్వహించారు. విభాగాధిపతి వి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీఈఎంఎస్ సీనియర్ టెక్నికల్ ఇంజినీర్లు శ్రీ శివ ప్రభు, శ్రీమతి భవాని ఇడదాసు రిసోర్స్ పర్సన్స్‌గా పాల్గొన్నారు. వారు ఐఓటీ, ఎంబెడెడ్ సిస్టమ్స్, మైక్రోకంట్రోలర్లు, సెన్సార్ల పనితీరు, ప్రాక్టికల్ అప్లికేషన్లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆధునిక పరిశ్రమల్లో ఐఓటీ, ఎంబెడెడ్ సిస్టమ్స్ ప్రాధాన్యతను వివరించారు. వర్క్‌షాప్‌లు విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ప్రాక్టికల్ నైపుణ్యాలను పెంపొందిస్తాయని డిప్యూటీ ప్రో-ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం.బి. శ్రీనివాస్, రిజిస్ట్రార్ డా. జి. సురేష్ తదితరులు తెలిపారు.

## ఆదిత్య యూనివర్సిటీలో ప్రాడక్ట్ డిజైన్‌పై వర్క్‌షాప్



**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 18:** ఆదిత్య యూనివర్సిటీలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో లి'ప్రొడక్ట్ డిజైన్ అండ్ అనాలిసిస్'లిపై విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహించారు. విశాఖపట్నంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైమ్ అండ్ షిప్‌బిల్డింగ్ (సీఈఎంఎస్) నిపుణులు రఘు సామ్రాట్, మోహన్ రావు పాల్గొని ఆధునిక డిజైన్ విధానాలు, అనాలిసిస్ పద్ధతులు, పరిశ్రమల్లో వినియోగిస్తున్న సాంకేతికతపై అవగాహన కల్పించారు. ప్రొడక్ట్ డిజైన్‌లో సృజనాత్మకతతో పాటు ఇంజినీరింగ్ అనాలిసిస్ ప్రాధాన్యతను వివరించారు. విభాగాధిపతి డా. ఎస్.డి.వి.వి.ఎస్. భీమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు పరిశ్రమ అవసరమైన నైపుణ్యాలు అందించేందుకు ఇటువంటి వర్క్‌షాప్‌లను కొనసాగిస్తామని తెలిపారు.

## ప్రజా ఆరోగ్య పరిరక్షణే సేవా సంకల్ప అభియాన్ లక్ష్యం.

-కిర్లంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాంబాబు నాయక్.



**కిర్లంపూడి, పెన్ పవర్, సెప్టెంబర్, 18:** ప్రజా ఆరోగ్య పరిరక్షణే సేవా సంకల్ప అభియాన్ లక్ష్యమని కిర్లంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాంబాబు నాయక్ అన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ 76 వ జన్మదినాన్ని పురస్కరించుకుని, దేశవ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు నిర్వహిస్తున్న "సేవా సంకల్ప అభియాన్" కార్యక్రమంలో భాగంగా కిర్లంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాంబాబు నాయక్ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన ఉట్ల గుడిసె రామాలయం వద్ద శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గౌతు వెంకయ్యనాయుడు (చినబాబు) ముఖ్యఅతిథిగా పాల్గొని ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించడమే కాకుండా, ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ రాంబాబు నాయక్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని చేపట్టిన "సేవా సంకల్ప అభియాన్" ముఖ్య ఉద్దేశ్యం సమాజంలో ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ శిబిరంలో స్థానిక ప్రజలకు ఉచితంగా సాధారణ వైద్య పరీక్షలు, బీపీ, షుగర్ వంటి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ప్రజలు జీవనశైలి మార్పులపై దృష్టి పెట్టి, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ, పరిశుభ్రత పాటించాలని వైద్యాధికారి సూచించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ సభ్యులు చదరం చంటి బాబు,కిర్లంపూడి సొసైటీ చైర్మన్ కుర్ల చినబాబు,నీటి సంఘం అధ్యక్షులు తూము శ్రీరామమూర్తి,టిడిపి నాయకులు తూము కుమార్, కాళ్ళ వెంకటేష్,వైద్యసిబ్బంది పి.హెచ్.ఎన్, కాశీ అన్నపూర్ణ, హెచ్ వి,అనంతలక్ష్మి, హెచ్.ఎస్, రమణమూర్తి, ఎఎన్ఎం, దేవి,ఎం.ఎల్.హెచ్ లు,పి రమ్య, గంగ, నిర్మల, మణి,ఆరోగ్య సహాయకులు నాగరాజు, సత్తార్, గణపతి , పలువురు ఆశా కార్యకర్తలు,గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అమృత్ 2.0 మెగా వాటర్ ప్రాజెక్ట్ పనులకు సామర్లకోటలో శ్రీకారం చుట్టారు.




**సామర్లకోట.. పెన్ పవర్.. సెప్టెంబర్. 18..** పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆదేశాల మేరకు స్థానిక బ్రౌన్ పేట టీచర్స్ కాలనీలో నూతన హెచ్డిపిఈ వాటర్ సప్లై పైప్లైన్ పనులను శుక్రవారం ప్రారంభించారు. ప్రజలందరికీ ఇంటింటా రక్షిత మంచినీటి సరఫరాను అందించాలన్న లక్ష్యంతో పనులు ప్రారంభించినట్లు సామర్లకోట తెలుగుదేశం పార్టీ టౌన్ అధ్యక్షులు బడుగు శ్రీకాంత్, టిడిపి 3వ వార్డు ఇన్చార్జ్ దాట్ల శ్రీనివాసరావు తెలిపారు. సామర్లకోటలో అభివృద్ధి సంక్షేమలకు ఎమ్మెల్యే వచ్చిన రాజప్ప అధిక ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందన్నారు.కొన్ని ప్రాంతంలో ప్రజలు త్రాగునీటి ఇబ్బందులకు గురువుతుండగా త్వరలోనే రక్షిత మంచినీటిని అందించేలా చర్యలు చేపట్టినట్లు నేతలు తెలిపారు.

# సాఫ్ట్‌బాల్ పోటీల్లో గొల్లపాలెం విద్యార్థినులకు కాంస్య పతకం

**కాజులూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 18:**బొబ్బిలిలో సెప్టెంబర్ 11 నుంచి 13వ తేదీ వరకు జరిగిన సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలికల జట్టు తృతీయ స్థానం సాధించి కాంస్య పతకం కైవసం చేసుకుంది. ఈ జట్టులో గొల్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థినులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.ఎస్.బి. సుశీలా మణి తెలిపిన వివరాల ప్రకారం.. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన కె. లోకేశ్వరి దీపిక, డి. సంగీత, బి. మేఘన, బి. ప్రసన్న, పి. వినీత తదితర విద్యార్థినులను శుక్రవారం పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో అభినందించారు. రాష్ట్రస్థాయిలో పతకం సాధించి పాఠశాలకు, ప్రాంతానికి పేరు తీసుకువచ్చిన విద్యార్థినులను పలువురు అభినందించారు. విద్యార్థినులకు శిక్షణ అందించిన పీడీలు జి.సునీల్ కుమార్,వి.ఇమ్మాన్యేల్ రాజులను కూడా ప్రత్యేక అధికారి, ఎంపీడీవో జె.రాంబాబు,సొసైటీ అధ్యక్షుడు అంగర కృష్ణ,నీటి సంఘం అధ్యక్షుడు తాడి రామారెడ్డి తదితరులు అభినందించారు.ఈ కార్యక్రమంలో చుండ్రు వీర్రాజు చౌదరి, నీటి సంఘం అధ్యక్షులు తాడి రామారెడ్డి,తోట కృష్ణ, డా. దేగల



నాగేంద్ర, దేగల సతీష్, దీవెన మెడికల్స్ వెంకన్నబాబు, పలివెల రాజు, నక్క శ్రీను, అంగర శ్రీను, కోకా హరి, ఆర్టోస్ చిన్న, పాఠశాల ఉపాధ్యాయులు పి.గంగరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛతతోనే ఆరోగ్య సమాజం




- **ప్రతి పౌరుడి బాధ్యతగా పరిశుభ్రతను పాటించాలి**
- **అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు**

**కాకినాడ, పెన్ పవర్ సెప్టెంబర్ 18:**పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించినప్పుడే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలమని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'స్వచ్ఛతా హి సేవా', 'స్వచ్ఛతా పఖ్వాడా' కార్యక్రమాల్లో భాగంగా ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్, రోటరాక్ట్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం కాకినాడ పోర్ట్ రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛతా అవగాహన, శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా 55 మంది ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. రైల్వే అధికారులు వాలంటీర్లకు స్టేషన్‌లో అమలు చేస్తున్న పరిశుభ్రతా చర్యలు, వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ, కోచ్‌ల శుభ్రత తదితర అంశాలను వివరించారు.అనంతరం వాలంటీర్లు ప్లాట్‌ఫాం, పరిసర ప్రాంతాల్లో శ్రమదానం నిర్వహించి పరిశుభ్రతకు సంబంధించిన అవగాహన కల్పించారు. ప్రయాణికులు, ప్రజలు బహిరంగ ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రోటరాక్ట్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ రోటేరియన్ చిరంజీవిరెడ్డి,ఏడీఎంఈ సుకుమార్,సి అండ్ డబ్ల్యూ డిపో ఇన్‌చార్జి రవికృష్ణ,రోటేరియన్లు సాయి, హరిదత్తకుమార్, రోటరీ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.కామరాజు హాజరయ్యారు.డాక్టర్ నాయుడు మాట్లాడుతూ.. రైల్వే స్టేషన్‌ల వంటి ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రదేశాల్లో పరిశుభ్రత పాటించడం అత్యంత అవసరమన్నారు.స్వచ్ఛత అనేది ప్రభుత్వ శాఖలకే పరిమితమైన కార్యక్రమం కాదని, ప్రతి పౌరుడి బాధ్యతగా భావించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా వ్యాధుల వ్యాప్తిని నియంత్రించి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు.కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు టి.తేజేశ్వరరావు,డి.అశ్విని, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## వాడపల్లి ఆలయానికి టెండర్ల ద్వారా పెరిగిన ఆదాయం

**సెల్‌ఫోన్, లగేజ్ భద్రత హక్కు రూ.35.50 లక్షలకు కైవసం.. ....షాపుల వేలంతోనూ అదనపు ఆదాయం**





**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 18 :** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో భక్తుల సౌకర్యాలకు సంబంధించిన పలు హక్కులకు శుక్రవారం ఈ–టెండర్లు, షీల్డ్ టెండర్లు, బహిరంగ వేలం నిర్వహించారు. ఆలయ ఆదాయాన్ని పెంపొందించే క్రమంలో నిర్వహించిన ఈ ప్రక్రియలో పలువురు పాల్గొని వివిధ హక్కులను దక్కించుకున్నారు.

శ్రీ స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల సెల్‌ఫోన్లు, లగేజ్ బ్యాగులను భద్రపరిచే హక్కుకు నిర్వహించిన షీల్డ్ టెండర్, బహిరంగ వేలంలో చొప్పెల్ల గ్రామానికి చెందిన తోరటి నవీన్ కుమార్ రూ.35 లక్షల 50 వేల వార్షిక మొత్తానికి హక్కును దక్కించుకున్నారు. గతంలో ఇదే హక్కు రూ.30,00,009కు దక్కగా, ఈసారి రూ.5,49,991 మేర అదనపు ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.అదేవిధంగా ఆలయ కార్ పార్కింగ్ ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన 10 తాత్కాలిక షాపులకు బహిరంగ వేలం నిర్వహించారు. వీటి ద్వారా మూడు సంవత్సరాల కాలానికి రూ.6,19,200 ఆదాయం సమకూరింది. శ్రీనివాస ప్రాంగణంలోని 15 షాపులకు సంబంధించి వేలం నిర్వహించగా, 8 షాపులకు మాత్రమే బహిరంగ వేలం జరిగింది. ఈ 8 షాపుల ద్వారా సంవత్సరానికి రూ.6,92,272 ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. గత పాటతో పోలిస్తే రూ.3,54,672 మేర ఆదాయం పెరిగినట్లు తెలిపారు.ఆలయానికి సంబంధించిన వివిధ హక్కులు, షాపుల నిర్వహణకు పారదర్శకంగా వేలం ప్రక్రియ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. వేలంలో పాల్గొన్న పలువురు వ్యక్తులు ఆయా హక్కులను దక్కించుకున్నారు.ఈ కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, లక్ష్మీపోలవరం గ్రూప్ టెంపుల్స్ ఈఓ పరిశీలకులుగా పాల్గొని పర్యవేక్షించారు.


# ఆదిత్య యూనివర్సిటీ సీఈఎస్ఈ విద్యార్థుల పారిశ్రామిక సందర్శన




**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 18: ఆదిత్య** యూనివర్సిటీ సీఈఎస్ఈ విభాగానికి చెందిన బీటెక్ రెండో సంవత్సరం విద్యార్థులు రాజమహేంద్రవరంలోని అమరావతి సాఫ్ట్‌వేర్ ఇన్నోవేషన్స్, కాకినాడలోని క్రిఫై సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్ సంస్థలను సందర్శించారు.

ఈ సందర్భంగా విద్యార్థులు ఆధునిక సాఫ్ట్‌వేర్ సాంకేతికతలు, అభివృద్ధి విధానాలు, ప్రాజెక్ట్ నిర్వహణ, డేటాబేస్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ తదితర అంశాలపై అవగాహన పొందారు. పారిశ్రామిక సందర్శనలు విద్యార్థుల్లో ప్రాయోగిక పరిజ్ఞానం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి భవిష్యత్ కెరీర్‌కు ఉపయోగపడతాయని డిప్యూటీ ప్రో చాన్సలర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎం.బి. శ్రీనివాస్, ప్రో వైస్ చాన్సలర్ డా. ఏ. రమేష్ తెలిపారు. విభాగాధిపతి డా. ఎ. ఫణి శ్రీధర్, ఇండస్ట్రియల్ విజిట్ కోఆర్డినేటర్ డా. జాలయ్య సైకం, అధ్యాపకులు పాల్గొన్నారు.

# వాడపల్లి క్షేత్రానికి భక్తుల పోటెత్తు



- **అష్టోత్తరం, పూజల్లో విశేషంగా పాల్గొన్న భక్తులు.. ..**
- **నిత్య అన్నదానానికి రూ.1,36,666 విరాళం**

**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 18 :**కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయానికి శుక్రవారం తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. స్వామివారి సన్నిధిలో నిర్వహించిన అష్టోత్తరం, కల్యాణ పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ప్రసాదాలను స్వీకరించి, ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన ప్రసాదాలను భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. ఈ సందర్భంగా రావులపాలెంకు చెందిన ఎం.వి. భూపతిరెడ్డి కుటుంబ సభ్యులు ఆలయంలో నిర్వహించే నిత్య అన్నదాన కార్యక్రమానికి రూ.1,36,666 విరాళాన్ని సమర్పించారు. భక్తులకు ప్రతిరోజూ అన్నదాన ప్రసాదాలను అందిస్తున్న ఆలయ సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారంగా ఈ విరాళాన్ని అందజేశారు.విరాళదాత కుటుంబ సభ్యులను ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి, స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు. ఆలయానికి విచ్చేసే భక్తులకు ఆధ్యాత్మిక సేవలతో పాటు అన్నదాన కార్యక్రమం ద్వారా సేవలు అందుతున్నాయని ఆలయ వర్గాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గణపతి నిమజ్జనాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**జగ్గంపేట ఎస్ఐ రఘునాధరావు**

**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 18:** గణపతి నిమజ్జనాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించాలని జగ్గంపేట ఎస్సై టి.రఘునాథరావు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జగ్గంపేట నుంచి గుర్రపాలెం వెళ్లే రోడ్డులో పుష్కర కాలువ వద్ద గణపతి నిమజ్జనాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. గణపతి విగ్రహాలను కాలువపై నుంచే నిమజ్జనాలు చేయాలని కమిటీ సభ్యులకు సూచించామన్నారు. భక్తులు ఎవరూ కాలువలోకి దిగకుండా అవగాహన కల్పిస్తున్నాం. భక్తులు కూడా సహకరించి తగిన జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలి. నిమజ్జనం సమయంలో మద్యం సేవించి డీజే శబ్దాలు అధికంగా పెట్టుకుంటే ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుంది కాబట్టి భక్తిశ్రద్ధలతో నిమజ్జనాలు నిర్వహించుకోవాలి. నిమజ్జనాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దు. అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రఘునాథరావు హెచ్చరించారు.



## వైద్య ఆరోగ్య శాఖా కాంట్రాక్ట్ ఉద్యోగులు నిరసన



**ఆలమూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 18:**రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ఆదేశాలమేరకు ఆసంస్థ ఉద్యోగులు శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలమూరులోని ప్రభుత్వ ఆస్పత్రి, పెదపళ్ల, చొప్పెల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద వైద్యారోగ్య సిబ్బంది మధ్యాహ్న భోజన విరామ సమయంలో తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న డిమాండ్లు నెరవేర్చాలని, ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని,సమాన పనికి సమాన వేతనం అందించాలంటూ నినాదాలు చేశారు. ల్యాబ్ టెక్నీషియన్స్ టి.సురేష్, కెవి.లక్ష్మి, రేడియోగ్రాఫర్ ఎర్రంరెడ్డి, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

## జాబ్ మేళాలో 59 మందికి ఉద్యోగాలు






**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 18**: జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ డి. చెన్నారావు ఆద్వర్యంలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ జిల్లా టిడిపి పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఎంపీడీఓ చంద్ర శేఖర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్బంగా జ్యోతుల నవీన్ మాట్లాడుతూ ఇలాంటి జాబ్ మేళాలను ప్రతి నిరుద్యోగ యువతి యువకులు ఉపయోగించుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ చెన్నారావు మాట్లాడుతూ కళాశాల పూర్వ విద్యార్దులు, తృతీయ సంవత్సర విద్యార్థులు, ఇతర అభ్యర్థులు ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ కాకినాడ జిల్లా మేనేజర్ ఎస. గోపికృష్ణ నిరుద్యోగులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ జాబ్ మేళాలో సాఫ్ట్ వేర్, ఫార్మా, బ్యాంకింగ్, బి.పి.ఒ మరియు టెక్నికల్ రంగాలైన సుమారు 18 ప్రముఖ కంపనీలలో 1200 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరిగాయి. ఈ జాబ్ మేళాలో కళాశాల పూర్వ విద్యార్థులు, తృతీయ సంవత్సర విద్యార్దులు, ఇతర అభ్యర్థులు మొత్తం 247 మంది నిరుద్యోగ యువతి యువకులు హాజరయ్యారు. వీరిలో 59 అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలు టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, కళాశాల ప్రిన్సిపల్ చెన్నారావు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్తకొండ బాబు, రాయి సాయి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిస్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం.

**–జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్,**




**కిర్లంపూడి,పెన్ పవర్,సెప్టెంబర్ 18**:ప్రజా సమస్యల పరిస్కారమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని జిల్లా టీడీపీ అధ్యక్షులు,జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ కుమార్ అన్నారు.బూరుగుపూడి గ్రామంలో జాతీయ రహదారి నుండి ఎస్సీ కాలనీ మీదుగా ఎర్ర చెరువుకు వెళ్లే ప్రధాన డ్రైన్ ను క్షేత్రస్థాయిలో నవీన్ పరిశీలించారు. డ్రైన్ పూడికత, నీటి ప్రవాహానికి ఉన్న అవరోధాలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు.అనంతరం ఇటీవల మెడకు సర్జరీ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న టీడీపీ కార్యకర్త గురజాపు సత్తిబాబును,అదే గ్రామానికి చెందిన పాము కాటుకు గురైన మరో టీడీపీ కార్యకర్త సోము పెద్దకాపును పరామర్శించి ఆరోగ్య యోగక్షేమాలు తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందేలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.కార్యకర్తల సంక్షేమానికి, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటామని ఈ సందర్భంగా జ్యోతుల నవీన్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కుంచే తాతాజీ, పాఠంశెట్టి రవి, పాఠంశెట్టి నాగేశ్వరరావు ( మీసాలు) పాఠం శెట్టి కొండరాజులు, కుంచే శ్రీనివాస్,మురా సత్తిబాబు, బాలుకల చిన్నోడు, పాఠంశెట్టి తమ్మారావు, బాలిన వెంకటేశ్వరరావు, మంచెం బాబ్జి, పాఠంశెట్టి రాంబాబు,సోము పుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## విఘ్నేశ్వరుని ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలి.

* వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మురళీకృష్ణంరాజు.



**కిర్లంపూడి,ప్రత్తిపాడు,పెన్ పవర్, సెప్టెంబర్,18:**విఘ్నేశ్వరుని ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి,నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు,ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. ప్రత్తిపాడు మండలం ధర్మవరం రామారావుపేట కృష్ణుడి గుడి వీధిలో వినాయక చవితి సందర్భంగా గణపతి నవరాత్రులు కార్యక్రమంలో కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని స్వామివారి అన్నదాన కార్యక్రమానికి రూ. 5 వేల రూపాయలు విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మచ్చర్ల దాసు,కోలా తాతబాబు,మాజీ వైస్ సర్పంచ్ జువ్వల సత్యనారాయణ,జువ్వల దొరబాబు,కోన బాబ్జి,దాడి పుత్రయ్య,నల్ల వెంకటేష్,బలిజీ వీర్రాజు,మాదేపల్లి సూరిబాబు,కర్రి రాము,పెదిరెడ్డి కృష్ణ,మర్రి మురళి,పిట్టి లోవరాజు,పోకనాటి వరహాలరావు,దేవరపు రాంబాబు,ఇంటి సత్తిబాబు,కృష్ణుడు గుడి కమిటీ సభ్యులు,ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల పాలిట ఒక వరం.

* సింహాద్రిపురంలో ఐదుగురు బాధితులకు1,60,456 రూపాయలు చెక్కులు పంపిణీలో జ్యోతుల నవీన్.



**కిర్లంపూడి, పెన్ పవర్,సెప్టెంబర్,18:**ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలపాలిట ఒక వరమని జిల్లా టిడిపి అధ్యక్షుడు, జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ అన్నారు. కిర్లంపూడి మండలం సింహాద్రిపురం గ్రామానికి చెందిన జాజిమొగ్గల సుబ్బలక్ష్మి, కాలపు రెడ్డి సుబ్బలక్ష్మి, మొగిలి రూపా దేవి, కందా దొంగబ్బాయి, కందా వీరబాబులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన 1,60,456 రూపాయల చెక్కులను జ్యోతుల నవీన్ శుక్రవారం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా జ్యోతుల నవీన్ మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వ అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నాయకత్వంలో పేదవాడికి వైద్యం భారం కాకూడదనే లక్ష్యంతో పని చేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వంలో నిర్వీర్యమైన సీఎం సహాయనిధికి కూటమి ప్రభుత్వం మళ్ళీ ప్రాణం పోసిందని, అర్హులైన ప్రతి ఒక్కరికి తక్షణ సాయం అందేలా చేస్తున్నామని తెలిపారు. కిర్లంపూడి మండలం సింహాద్రిపురం గ్రామంలో అయిదుగురికి అనారోగ్యంతో దరఖాస్తు చేయగానే ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చొరవతో వెంటనే చెక్కు మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. అనంతరం గ్రామంలో వినాయక మండపాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన నవీన్. ఇంటి వద్దకే వచ్చి సహాయం అందించడం పట్ల లబ్ధిదారుల కుటుంబాలు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే నెహ్రూ, జ్యోతుల నవీన్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు,వీరం రెడ్డి కాశిబాబు,ఎంపీపీ తోట రవి,జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ చదరం చంటిబాబు,కిర్లంపూడి సొసైటీ అధ్యక్షుడు కుర్ల చినబాబు,టిడిపి నాయకులు తూము కుమార్,కాళ్ల వెంకటేష్,మండల తెలుగుయువత అధ్యక్షుడు గండే కాశీ,బోదిరెడ్ల సుబ్బారావు,బుర్రి సత్తిబాబు, రేఖ బుల్లిరాజు, కాకిలేటి రాయుడు, కాకిలేటి బుజ్జి,కందా సత్యానందం, నంది రాజారావు,నంది బాలకృష్ణ, కాకిలేటి వీర్రాజు, కందా అప్పన్న, కాకిలేటి జయబాబు, గొల్లపల్లి సూరిబాబు, మాదేపల్లి నందీశ్వరుడు, కాకిలేటి రాజా తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల భద్రతపై అవగాహన కల్పించాలి

లక్కీ షాపింగ్ మాల్‌లో కాకినాడ జిల్లా పోలీసుల అవగాహన కార్యక్రమం



**కాకినాడ, పెన్‌పవర్, సెప్టెంబర్ 18:**పిల్లల భద్రత, పోక్సో చట్టం, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నిర్మూలనపై కాకినాడ జిల్లా పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్, ఆదేశాల మేరకు కాకినాడ మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సై బి. అనూష ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక లక్కీ షాపింగ్ మాల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల భద్రతపై తల్లిదండ్రులు, ముఖ్యంగా తల్లులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టంపై పిల్లలకు అవగాహన కల్పించాలని తెలిపారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. వ్యక్తిగత ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పంచుకోవడం వల్ల ఎదురయ్యే అనర్థాలపై ప్రజలకు వివరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అత్యవసర పరిస్థితుల్లో 112, సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930కు సమాచారం అందించాలని సూచించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయం లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వారు 1972కు సమాచారం అందిస్తే బహుమతి అందజేస్తామని తెలిపారు. జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన 'రైజ్ ఎగైనెస్ట్ గాంజా' కార్యక్రమం ద్వారా కూడా మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది, శక్తి టీం సభ్యులు, లక్కీ షాపింగ్ మాల్ యాజమాన్యం, సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలకు సన్నద్ధం

**ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలి**





**గండేపల్లి,పెన్ పవర్, సెప్టెంబర్ 18:** ఈ నెల 29న జరగనున్న స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయంతో బాధ్యతలు నిర్వర్తించాలని మండల అభివృద్ధి అధికారి కె. హరికృష్ణ సత్యారెడ్డి సూచించారు. గండేపల్లి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి కె. హెచ్. నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీవో హరికృష్ణ సత్యారెడ్డి హాజరై స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన విధివిధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులకు తావులేకుండా చూడాలన్నారు. ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసుకుని, ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో తాళ్లూరు, నాయకంపల్లి, ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో పాటు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు ఆర్థిక సాక్షరతే లక్ష్యం..

**బ్యాంకింగ్, పెట్టుబడులు, సైబర్ మోసాలపై ఆర్బీఐ 'యూప్లిఫ్ట్' అవగాహన...**





**శంఖవరం పెన్ పవర్ సెప్టెంబర్ 18:-** నేటి డిజిటల్ యుగంలో ఆర్థిక లావాదేవీలు రోజురోజుకూ విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ బ్యాంకింగ్ సేవలు, పొదుపు, పెట్టుబడులు, డిజిటల్ చెల్లింపులు, సైబర్ భద్రతపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని పలువురు అధికారులు పేర్కొన్నారు. ఉపాధ్యాయుల్లో ఆర్థిక సాక్షరతను పెంపొందించడంతో పాటు, విద్యార్థులకు ఆర్థిక విషయాలపై సరైన అవగాహన కల్పించేలా వారిని సన్నద్ధం చేయాలనే లక్ష్యంతో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) ఆధ్వర్యంలో కత్తిపూడి శివారు సీతమ్మపేట గ్రామంలోని రిఫరల్ స్కూల్‌లో శుక్రవారం 'యూప్లిఫ్ట్' కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ (ఎల్డీఎం) సి. హెచ్. ఎల్. వి. ప్రసాద్

అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆర్బీఐ మేనేజర్ రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు బ్యాంకింగ్ వ్యవస్థ, ఆర్థిక నిర్వహణ, పొదుపు, పెట్టుబడులు, డిజిటల్ లావాదేవీలు, సైబర్ మోసాల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

స్కూల్ ప్రిన్సిపాల్ బలరాం మహంతి మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు వారికి ఆర్థిక విషయాలపై ప్రాథమిక అవగాహన కల్పించడం కూడా ఎంతో ముఖ్యమన్నారు. కుటుంబాల్లో ఆర్థిక నిర్ణయాలు తీసుకునే సమయంలో సరైన సమాచారం, అవగాహన ఉండటం వల్ల భవిష్యత్‌లో అనేక సమస్యలను నివారించవచ్చన్నారు. ఉపాధ్యాయులు ఆర్థిక అంశాలపై అవగాహన పెంచుకుని, ఆ విషయాలను విద్యార్థులకు సులభమైన పద్ధతిలో వివరించాలని సూచించారు.

కార్యక్రమంలో ఆర్బీఐ అధికారులు బ్యాంకింగ్ సేవలను సురక్షితంగా వినియోగించుకునే విధానాలను వివరించారు. పొదుపు ఖాతాల ప్రాముఖ్యత, డిజిటల్ చెల్లింపుల వినియోగం, యూపీఐ లావాదేవీల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆర్థిక ప్రణాళిక, వివిధ పెట్టుబడి అవకాశాలపై అవగాహన కల్పించారు. పెట్టుబడులు పెట్టే ముందు సంబంధిత సంస్థలు, పథకాల విశ్వసనీయతను పరిశీలించాలని, అధిక లాభాలు వస్తాయని ఆశ చూపే అనుమానాస్పద పథకాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ మోసాలపై కూడా అధికారులు ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. బ్యాంకు అధికారులు, ప్రభుత్వ సంస్థల పేరుతో వచ్చే అనుమానాస్పద ఫోన్‌కాల్స్, సందేశాలు, లింకులను నమ్మవద్దని సూచించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం కార్డు వివరాలు, ఓటీపీ, యూపీఐ పిన్ వంటి గోప్య సమాచారాన్ని ఇతరులతో పంచుకోకూడదని స్పష్టం చేశారు. అత్యవసరమని చెప్పి వ్యక్తిగత లేదా బ్యాంకింగ్ వివరాలు కోరే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


డిజిటల్ చెల్లింపులు సౌకర్యవంతంగా ఉన్నప్పటికీ, వాటిని జాగ్రత్తగా వినియోగించడం ద్వారా మాత్రమే ఆర్థిక నష్టాలను నివారించగలమని అధికారులు తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కూడా సైబర్ భద్రతపై అవగాహన కల్పించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఉపాధ్యాయులు బ్యాంకింగ్ సేవలు, పెట్టుబడులు, డిజిటల్ లావాదేవీలు, సైబర్ మోసాల నివారణకు సంబంధించిన పలు సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఆర్థిక అంశాలపై విద్యార్థుల్లో చిన్న వయస్సు నుంచే అవగాహన పెంపొందించేందుకు అప్లిఫ్ట్ వంటి కార్యక్రమాలు ఉపయోగకరంగా ఉంటాయని పలువురు అభిప్రాయపడ్డారు.

కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ పాలస్ రవీంద్ర, డైరెక్టర్ రేణుక, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు ఆర్థిక సాక్షరతే లక్ష్యం..

**బ్యాంకింగ్, పెట్టుబడులు, సైబర్ మోసాలపై ఆర్బీఐ 'యూప్లిఫ్ట్' అవగాహన...**





**శంఖవరం పెన్ పవర్ సెప్టెంబర్ 18:-** నేటి డిజిటల్ యుగంలో ఆర్థిక లావాదేవీలు రోజురోజుకూ విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ బ్యాంకింగ్ సేవలు, పొదుపు, పెట్టుబడులు, డిజిటల్ చెల్లింపులు, సైబర్ భద్రతపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని పలువురు అధికారులు పేర్కొన్నారు. ఉపాధ్యాయుల్లో ఆర్థిక సాక్షరతను పెంపొందించడంతో పాటు, విద్యార్థులకు ఆర్థిక విషయాలపై సరైన అవగాహన కల్పించేలా వారిని సన్నద్ధం చేయాలనే లక్ష్యంతో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) ఆధ్వర్యంలో కత్తిపూడి శివారు సీతమ్మపేట గ్రామంలోని రిఫరల్ స్కూల్‌లో శుక్రవారం 'యూప్లిఫ్ట్' కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ (ఎల్డీఎం) సి. హెచ్. ఎల్. వి. ప్రసాద్

అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆర్బీఐ మేనేజర్ రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు బ్యాంకింగ్ వ్యవస్థ, ఆర్థిక నిర్వహణ, పొదుపు, పెట్టుబడులు, డిజిటల్ లావాదేవీలు, సైబర్ మోసాల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

స్కూల్ ప్రిన్సిపాల్ బలరాం మహంతి మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు వారికి ఆర్థిక విషయాలపై ప్రాథమిక అవగాహన కల్పించడం కూడా ఎంతో ముఖ్యమన్నారు. కుటుంబాల్లో ఆర్థిక నిర్ణయాలు తీసుకునే సమయంలో సరైన సమాచారం, అవగాహన ఉండటం వల్ల భవిష్యత్‌లో అనేక సమస్యలను నివారించవచ్చన్నారు. ఉపాధ్యాయులు ఆర్థిక అంశాలపై అవగాహన పెంచుకుని, ఆ విషయాలను విద్యార్థులకు సులభమైన పద్ధతిలో వివరించాలని సూచించారు.

కార్యక్రమంలో ఆర్బీఐ అధికారులు బ్యాంకింగ్ సేవలను సురక్షితంగా వినియోగించుకునే విధానాలను వివరించారు. పొదుపు ఖాతాల ప్రాముఖ్యత, డిజిటల్ చెల్లింపుల వినియోగం, యూపీఐ లావాదేవీల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆర్థిక ప్రణాళిక, వివిధ పెట్టుబడి అవకాశాలపై అవగాహన కల్పించారు. పెట్టుబడులు పెట్టే ముందు సంబంధిత సంస్థలు, పథకాల విశ్వసనీయతను పరిశీలించాలని, అధిక లాభాలు వస్తాయని ఆశ చూపే అనుమానాస్పద పథకాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ మోసాలపై కూడా అధికారులు ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. బ్యాంకు అధికారులు, ప్రభుత్వ సంస్థల పేరుతో వచ్చే అనుమానాస్పద ఫోన్‌కాల్స్, సందేశాలు, లింకులను నమ్మవద్దని సూచించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం కార్డు వివరాలు, ఓటీపీ, యూపీఐ పిన్ వంటి గోప్య సమాచారాన్ని ఇతరులతో పంచుకోకూడదని స్పష్టం చేశారు. అత్యవసరమని చెప్పి వ్యక్తిగత లేదా బ్యాంకింగ్ వివరాలు కోరే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

డిజిటల్ చెల్లింపులు సౌకర్యవంతంగా ఉన్నప్పటికీ, వాటిని జాగ్రత్తగా వినియోగించడం ద్వారా మాత్రమే ఆర్థిక నష్టాలను నివారించగలమని అధికారులు తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కూడా సైబర్ భద్రతపై అవగాహన కల్పించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఉపాధ్యాయులు బ్యాంకింగ్ సేవలు, పెట్టుబడులు, డిజిటల్ లావాదేవీలు, సైబర్ మోసాల నివారణకు సంబంధించిన పలు సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఆర్థిక అంశాలపై విద్యార్థుల్లో చిన్న వయస్సు నుంచే అవగాహన పెంపొందించేందుకు అప్లిఫ్ట్ వంటి కార్యక్రమాలు ఉపయోగకరంగా ఉంటాయని పలువురు అభిప్రాయపడ్డారు.

కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ పాలస్ రవీంద్ర, డైరెక్టర్ రేణుక, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# పవన్ కళ్యాణ్ పిఠాపురం పర్యటనకు పటిష్ట బందోబస్తు





**పర్యటనా ప్రాంతాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ బిందుమాధవ్**

**కాకినాడ/పిఠాపురం ,పెన్‌పవర్, సెప్టెంబర్ 18:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఈ నెల 21, 22 తేదీల్లో పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో కాకినాడ జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపడుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్, శుక్రవారం పర్యటనా ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించి, భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులతో సమీక్షించారు.పిఠాపురం ఆర్‌అండ్‌బీ అతిథి గృహం, రథాలపేట, యు.కొత్తపల్లి మండలం సూరప్ప చెరువు, కొండెవరం, గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామాల్లో ఉప ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలను ఎస్పీ పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో భద్రతా పరంగా తీసుకోవాల్సిన చర్యలు, పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు.పర్యటన సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీ ఆదేశించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ముందస్తు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టడంతో పాటు పార్కింగ్, ప్రజల రాకపోకల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పర్యటనలో పాల్గొనే ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఇతర వర్గాల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ అన్ని ఏర్పాట్లను సమన్వయంతో పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ పరిశీలనలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డా. మహంతి కిషోర్ కుమార్, అడిషనల్ ఎస్పీ (ఏఆర్) ఎస్. శ్రీనివాసరావు, ఎస్బీ డీఎస్పీ కె.వి.వి.సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ వి.జి. శ్రీహరి రావు, పిఠాపురం సీఐ జి.వి.వి. సత్యనారాయణ, కాకినాడ ట్రాఫిక్-1 ఇన్‌స్పెక్టర్ ఎన్.రమేష్, పిఠాపురం సర్కిల్ ఎస్సైలు,రెవెన్యూ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కిర్లంపూడిలో ఘనంగా లలితా సప్తమి వేడుకలు.



**కిర్లంపూడి, పెన్ పవర్, సెప్టెంబర్, 18:** లలితా సప్తమి వేడుకలను కిర్లంపూడిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన కిర్లంపూడి గ్రామంలో వేంచేసియున్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మహిళలు సామూహికంగా నక్షత్రమాల శ్రీ లలిత సహస్రనామ పారాయణ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గత కొంతకాలంగా వర్షాలు పడకపోవడంతో రైతులతో పాటు ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్న కారణంగా లోక కళ్యాణార్థం నక్షత్రమాల లలితా సహస్రనామ పారాయణ సంకల్పించినట్లు వాసవి మహిళా సంఘం సభ్యులు తెలిపారు. ఆలయ ప్రధానార్చకులు గోవర్ధనం సత్య నాగ గోపాలచార్యుల ఆధ్వర్యంలో శ్రీ చక్రానికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన జరిపించారు. అనంతరం కిర్లంపూడి, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, జగ్గంపేట తదితర మండలాల నుండి భారీ సంఖ్యలో మహిళలు అమ్మవారి ఆలయానికి తరలి వచ్చారు. ఉదయం 6 గంటల నుండి నక్షత్రమాల లలితా సహస్రనామ పారాయణ ప్రారంభించి సాయంత్రం 6 గంటల వరకు నిర్విరామంగా నిర్వహించారు. మహిళలు 27 హారతులు ఆలయంలో అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు పారాయణలో పాల్గొన్న భక్తులతో పాటు అమ్మవారి ఆలయానికి తరలివచ్చిన భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. మహిళలకు పసుపు కుంకుమలు అందజేశారు. కార్యక్రమాన్ని జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికి ఆలయ కమిటీతో పాటు మహిళా సంఘ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**యాప్‌ల వలలో పడి ఆన్‌లైన్ రుణాలు తీసుకోవద్దు**

**అత్యవసరమైతేనే రుణాలు తీసుకోండి**

**క్రైమ్ సీఐ అంకబాబు**

**కాకినాడ, పెన్‌పవర్, సెప్టెంబర్ 18:** సైబర్ మోసాల పట్ల యువత, మహిళలు అప్రమత్తంగా ఉండాలని సామర్లకోట క్రైమ్ సీఐ ఆర్. అంకబాబు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే రుణాలు తీసుకోవాలని, సరదా అవసరాల కోసం ఫోన్ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకునే అలవాటును మానుకోవాలని సూచించారు.సర్పవరం పరిధిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఎంఫిన్ ఆధ్వర్యంలో ఫ్యూజియన్ ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థ మైక్రోఫైనాన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ముఖ్య అతిథిగా హాజరైన సీఐ అంకబాబు మాట్లాడుతూ బ్యాంకు ఖాతా వివరాలను ఇతరులకు వెల్లడించరాదన్నారు.బ్యాంకు లేదా ఇతర సంస్థల నుంచి మాట్లాడుతున్నామని చెప్పి ఓటీపీ, ఖాతా వివరాలు అడిగినా ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వవద్దని హెచ్చరించారు.గుర్తింపు లేని మొబైల్ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకోవద్దని, వాటి వల్ల అధిక వడ్డీలు,వేధింపులు తదితర సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపారు. వీలైనంత వరకు ఆన్‌లైన్ రుణాలకు దూరంగా ఉండటం మంచిదన్నారు. పేద, మధ్యతరగతి ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని కొందరు అధిక వడ్డీలు, బహుమతులు తదితర ఆశలు చూపి మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎంఫిన్ ఉపాధ్యక్షుడు పి.కమలేశ్ మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలు ఇటీవలి కాలంలో పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వివిధ రకాల ఆశలు చూపి ప్రజల నుంచే డబ్బులు దోచుకునేందుకు సైబర్ నేరగాళ్లు ప్రయత్నిస్తున్నారని వివరించారు.

లీడ్ బ్యాంక్ ప్రతినిధి శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలు పొదుపును అలవాటుగా చేసుకుని, ఆ మొత్తాన్ని బ్యాంకుల్లో జమ చేసి కుటుంబ ఆర్థికాభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. ఇతరుల కోసం అప్పులు చేసే విధానాన్ని మానుకుని, కుటుంబ ఆర్థిక స్థిరత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఫ్యూజియన్ ఫైనాన్స్ రీజినల్ మేనేజర్ బి. కిరణ్‌కుమార్ సూచించారు. రిజర్వ్ బ్యాంక్ గుర్తింపు పొందిన సంస్థల నుంచే రుణాలు తీసుకోవాలని, అలాంటి సంస్థలు నిబంధనల ప్రకారం వినియోగదారులకు సేవలు అందిస్తాయని తెలిపారు.సైబర్ నేరాలు ఏ విధంగా జరుగుతున్నాయో సైబర్ క్రైమ్ విభాగానికి చెందిన దుర్గాప్రసాద్ స్క్రీన్‌పై వివరిస్తూ అవగాహన కల్పించారు.కార్యక్రమంలో గంగిరెడ్డి బలరాం, ఫ్యూజియన్ క్లస్టర్ మేనేజర్ జి.వి.వి. ప్రసాద్, మైక్రోఫైనాన్స్ సంస్థల ప్రతినిధులు ఎం.రాఘవనాయుడు, జి. కృష్ణ, కె. డేవిడ్, ఏ.కొండబాబు,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాల అమలులో బ్యాంకర్లు, శాఖల సమన్వయం కీలకం





- **అర్హులైన లబ్ధిదారులకు రుణాలు సకాలంలో అందాలి**
- **జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**

**కాకినాడ, పెన్‌పవర్, సెప్టెంబర్ 18:** బ్యాంకు రుణాలతో ముడిపడి ఉన్న ప్రభుత్వ పథకాల అమలులో బ్యాంకర్లు, ప్రభుత్వ శాఖలు పూర్తి సమన్వయంతో పనిచేయాలని, అర్హులైన లబ్ధిదారులకు రుణాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ స్పష్టం చేశారు.సమాజ అభివృద్ధిలో బ్యాంకర్లు, ప్రభుత్వ శాఖలు కీలక పాత్ర పోషించాలని సూచించారు.

2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జూన్ 30తో ముగిసిన తొలి త్రైమాసిక పురోగతి, రెండో త్రైమాసిక కార్యాచరణ అమలు తీరుపై శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి సమీక్షా కమిటీ,జిల్లా స్థాయి సంప్రదింపుల కమిటీ సమావేశాలు కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జి.హెచ్.ఎస్.వి. ప్రసాద్ సమర్పించిన నివేదిక ఆధారంగా జిల్లాలో బ్యాంకర్ల పనితీరు, వివిధ ప్రభుత్వ పథకాలకు రుణాల కల్పన, కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు, ఆర్థిక సమ్మిళిత కార్యక్రమాల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు.ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన,ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం,పీఎం విశ్వకర్మ, పీఎం సూర్యఘర్,జిల్లా వార్షిక క్రెడిట్ ప్లాన్ అమలు, త్రైమాసిక లక్ష్యాల సాధనపై బ్యాంకు శాఖల వారీగా పురోగతిని పరిశీలించారు. గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలపై చేపట్టిన చర్యలను ఎల్‌డీఎం వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయం,పారిశ్రామిక అభివృద్ధి, ఎంఎస్‌ఎంఈ,ఇతర ఉత్పాదక రంగాలకు బ్యాంకు రుణాల అనుసంధానాన్ని మరింత పెంచాలని సూచించారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన అర్హత కలిగిన దరఖాస్తులను బ్యాంకులు త్వరితగతిన పరిశీలించి, మంజూరైన రుణాలను సకాలంలో లబ్ధిదారులకు అందించాలని ఆదేశించారు.ప్రభుత్వ ప్రాయోజిత పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా బ్యాంకులు,సంబంధిత ప్రభుత్వ శాఖలు నిరంతర సమన్వయంతో పనిచేయాలని అన్నారు.వ్యవసాయ పంట రుణాలతో పాటు పాడి,పశుసంవర్ధక, మత్స్య, ఉద్యాన రంగాలు,రైతు ఉత్పత్తిదారుల సంఘాలు,వ్యవసాయ మౌలిక వసతులకు రుణ సదుపాయాలు కల్పించడంపై సమావేశంలో చర్చించారు.కౌలు రైతు భరోసా కార్డుల ఆధారంగా రైతులకు పంట రుణాలు మంజూరు చేయడంలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు.మహిళా స్వయం సహాయక సంఘాలు,యువత స్వయం ఉపాధి,మత్స్యకారులు,చిన్న వ్యాపారులకు రుణ సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ అన్నారు. అర్హులైన లబ్ధిదారుల రుణ దరఖాస్తులను అనవసరంగా పెండింగ్‌లో ఉంచరాదని, ప్రభుత్వ శాఖలు సిఫార్సు చేసిన అర్హతగల దరఖాస్తులను నిబంధనల మేరకు సకాలంలో పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత కాలవ్యవధిలో సాధించేందుకు బ్యాంకర్లు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ వంటి ప్రతిష్ఠాత్మక పథకాలపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించి, రాయితీలను సద్వినియోగం చేసుకునేలా ప్రజలను ప్రోత్సహించాలని సూచించారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం, పీఎం విశ్వకర్మ తదితర కేంద్ర ప్రాయోజిత పథకాల అమలులో బ్యాంకర్లు, ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. నాబార్డ్ ద్వారా గ్రామీణాభివృద్ధికి మరింత తోడ్పాటు అందించాలని సూచించారు. సమావేశంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ బి.జి.ఆర్. నాయుడు,ఆర్‌బీఐ ఆర్‌ఎం రామకృష్ణ, డీఆర్డీఏ పీడీ జి.శ్రీనివాసరావు,మెప్మా పీడీ శైలజ,నాబార్డ్ డీడీఎం స్వామినాయుడు,వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు,బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల భద్రతపై అవగాహన కల్పించాలి

**లక్కీ షాపింగ్ మాల్‌లో కాకినాడ జిల్లా పోలీసుల అవగాహన కార్యక్రమం**



**కాకినాడ, పెన్‌పవర్, సెప్టెంబర్ 18:** పిల్లల భద్రత, పోక్సో చట్టం, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నిర్మూలనపై కాకినాడ జిల్లా పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు.జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్, ఆదేశాల మేరకు కాకినాడ మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సై బి. అనూష ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక లక్కీ షాపింగ్ మాల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల భద్రతపై తల్లిదండ్రులు, ముఖ్యంగా తల్లులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టంపై పిల్లలకు అవగాహన కల్పించాలని తెలిపారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. వ్యక్తిగత ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పంచుకోవడం వల్ల ఎదురయ్యే అనర్థాలపై ప్రజలకు వివరించారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అత్యవసర పరిస్థితుల్లో 112, సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930కు సమాచారం అందించాలని సూచించారు.గంజాయి వంటి మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయం లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వారు 1972కు సమాచారం అందిస్తే బహుమతి అందజేస్తామని తెలిపారు. జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన 'రైజ్ ఎగైనెస్ట్ గాంజా' కార్యక్రమం ద్వారా కూడా మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు గుర్తు చేశారు.కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది, శక్తి టీం సభ్యులు, లక్కీ షాపింగ్ మాల్ యాజమాన్యం, సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

### నేర పరిశోధనలో ఇక శాస్త్రీయ ఆధారాల సేకరణ మరింత వేగం

- **మొబైల్ ఫోరెన్సిక్ యూనిట్ కుపచ్చజెండా ఊపిన**
- **ఎస్పీ బిందుమాధవ్**




**కాకినాడ, పెన్‌పవర్, సెప్టెంబర్ 18:** నేరస్థలాల్లో శాస్త్రీయ ఆధారాల సేకరణను మరింత వేగవంతం చేసేందుకు కాకినాడ జిల్లా పోలీసులకు మొబైల్ ఫోరెన్సిక్ వాన్ అందుబాటులోకి వచ్చింది. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్, పచ్చజెండా ఊపి ఈ మొబైల్ ఫోరెన్సిక్ యూనిట్‌ను ప్రారంభించారు.

నేరస్థలానికి నేరుగా చేరుకుని అక్కడికక్కడే ఆధారాలను గుర్తించడం, డాక్యుమెంటేషన్ చేయడం,సేకరించడం, భద్రపరచడం, ప్రాథమిక పరిశీలన నిర్వహించడం వంటి సేవలను అందించేలా ఈ వాహనాన్ని రూపొందించారు. నేరస్థల పరిరక్షణతో పాటు సాధారణంగా కంటికి కనిపించని ఆధారాలను గుర్తించేందుకు హై-ఇంటెన్సిటీ ఫోరెన్సిక్ లైట్లు సహా అధునాతన పరికరాలను ఇందులో ఏర్పాటు చేశారు.వాన్‌లో రక్తం, వీర్యం వంటి జీవ ఆధారాల ప్రాథమిక పరీక్ష, సేకరణ కిట్లు, డీఎన్ఏ నమూనా సేకరణ కిట్, మాదకద్రవ్యాలు, పేలుడు పదార్థాల స్క్రీనింగ్ కిట్లు, గన్‌షాట్ రెసిడ్యూ సేకరణ కిట్, బుల్లెట్ హోల్ పరిశీలన కిట్ అందుబాటులో ఉన్నాయి.ట్రేస్ ఎవిడెన్స్ పరిశీలనకు స్టీరియో మైక్రోస్కోప్, డీఎస్ఎల్ఆర్ కెమెరా,బాడీ వోర్న్ కెమెరా,జీపీఎస్, సీసీటీవీ, డాష్‌బోర్డ్ కెమెరాలు,మినీ రిఫ్రిజిరేటర్, వెయింగ్ బ్యాలెన్స్, జనరేటర్ తదితర పరికరాలు కూడా ఉన్నాయి.అదేవిధంగా డిజిటల్ ఆధారాల సేకరణ, భద్రపరచడం, ఇమేజింగ్, ట్రయాజ్ కోసం ప్రత్యేక డిజిటల్ ఇన్వెస్టిగేషన్ కిట్, ఫోరెన్సిక్ ఇమేజర్, పెన్‌డ్రైవ్‌లు, మెమరీ కార్డులు, ఎస్ఎస్‌డీ స్టోరేజ్, డిజిటల్ డివైస్ అక్విజిషన్ పరికరాలు అందుబాటులో ఉన్నాయి. అనుమానాస్పద అగ్ని, గ్యాస్ ఘటనల్లో గ్యాస్ గుర్తింపు వంటి సేవలను కూడా ఈ యూనిట్ ద్వారా అందించవచ్చు.

మొబైల్ ఫోరెన్సిక్ యూనిట్ అందుబాటులోకి రావడంతో నేరస్థల స్పందన వేగవంతం కావడంతో పాటు, ఆధారాల సేకరణ--భద్రత, శాస్త్రీయ దర్యాప్తు, కేసుల పరిశోధనలో పోలీసులకు మెరుగైన ఫోరెన్సిక్ సహకారం లభించనుంది.కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డా. మహంతి కిషోర్ కుమార్, అడిషనల్ ఎస్పీ (ఏఆర్) ఎస్. శ్రీనివాసరావు, ఎస్బీ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ వి.జి.శ్రీహరి రావు,క్లూస్ టీమ్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు, క్లూస్ టీమ్ ఎస్సై ఎస్. ప్రశాంతి,డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసరావు, డీటీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ బి.రాజశేఖర్,రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎం.నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఈపీడీసీఎల్ ఎస్ఈగా నల్లం ఉదయభాస్కర్

**కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఎస్ఈ**



**కాకినాడ, పెన్‌పవర్, సెప్టెంబర్ 18:** కాకినాడ డివిజన్‌లో ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న నల్లం ఉదయభాస్కర్ పదోన్నతిపై కాకినాడ జిల్లా ఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా నియమితులయ్యారు.ఈ సందర్భంగా శుక్రవారం ఆయన కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జిల్లా విద్యుత్ రంగానికి సంబంధించిన అంశాలు, తన కొత్త బాధ్యతలపై కలెక్టర్‌తో ఆయన చర్చించారు.

# దేశవాళీ అంపైర్లకు బీసీసీఐ గుడ్ న్యూస్.. వేతనాల పెంపునకు ఏకగ్రీవ ఆమోదం

- దేశవాళీ అంపైర్లు, రిఫరీల వేతనాల సవరణకు బీసీసీఐ ఆమోదం
- ఐపీఎల్ పాలకమండలి సభ్యులుగా అరుణ్ సింగ్ ధూమల్, మజుందార్ ఏకగ్రీవ ఎన్నిక
- 2027లో ఐపీఎల్ 20వ ఎడిషన్, 2028లో బోర్డు శతాబ్ది ఉత్సవాలకు నిర్ణయం
- దివ్యాంగ క్రికెటర్లకు మద్దతు పెంచడంపై సమావేశంలో ప్రత్యేక చర్చ
- 2026-27 వార్షిక బడ్జెట్‌కు ఆమోదం తెలిపిన సర్వసభ్య సమావేశం




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) దేశవాళీ అంపైర్లు, మ్యాచ్ రిఫరీలకు సంబంధించి ఒక కీలకమైన, సానుకూల నిర్ణయం తీసుకుంది. వారి వేతనాల పెంపుతో పాటు, గ్రేడ్లను పునర్వర్గీకరించే ప్రతిపాదనకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. నేడు ముంబైలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో జరిగిన 95వ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. దేశవాళీ క్రికెట్ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ఈ చర్య ఎంతో ముఖ్యమైనదిగా భావిస్తున్నారు.ఈ సమావేశంలో ఐపీఎల్ పాలక మండలికి (జీసీ) ఇద్దరు సభ్యుల ఎన్నిక ప్రక్రియ కూడా పూర్తయింది. ఐపీఎల్ ఛైర్మన్‌గా మరోసారి కొనసాగేందుకు పోటీ పడిన అరుణ్ సింగ్ ధూమల్, ఇండియన్ క్రికెటర్స్ అసోసియేషన్ (ఐసీఏ) ప్రతినిధిగా ఎం. ఖైరుల్ జమాల్ మజుందార్ తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ రెండు స్థానాలకు మరెవరూ నామినేషన్లు దాఖలు చేయకపోవడంతో, బీసీసీఐ ఎన్నికల అధికారి ఏ.కే. జోటి వారి ఎన్నికను అధికారికంగా ధ్రువీకరించారు. దీనితో ఐపీఎల్ పరిపాలనలో స్థిరత్వం కొనసాగనుంది.సమావేశంలో పలు ఆర్థిక, పరిపాలనాపరమైన తీర్మానాలకు కూడా ఆమోదం లభించింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిటెడ్ ఖాతాలను, 2026-27 వార్షిక బడ్జెట్‌ను జనరల్ బాడీ ఆమోదించింది. రాబోయే ఆర్థిక సంవత్సరానికి ఆడిటర్లను కూడా నియమించింది.భవిష్యత్ ప్రణాళికలపై కూడా బోర్డు దృష్టి సారించింది. 2027లో జరగనున్న ఐపీఎల్ 20వ ఎడిషన్‌ను ఘనంగా నిర్వహించాలని, అలాగే 2028లో బీసీసీఐ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా జరపాలని తీర్మానించింది. శతాబ్ది వేడుకలు 2027 డిసెంబర్‌లో ప్రారంభమై 2028 అంతటా కొనసాగుతాయని బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది.

వీటితో పాటు, లైంగిక వేధింపుల నిరోధక (గూూూ) పాలసీ కింద కొత్త అంతర్గత కమిటీని ఏర్పాటు చేశారు. వయో నిర్ధారణ విధానానికి కూడా నూతనంగా ఆమోదం తెలిపారు. దేశంలోని దివ్యాంగ క్రికెటర్లకు మద్దతును మరింత క్రమబద్ధీకరించడం, వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించడంపై కూడా రాష్ట్ర సంఘాలతో

చర్చించారు.ఈ సమావేశంలో బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, కార్యదర్శి దేవజిత్ సైకియా, సౌరభ్ తివారీ, జయదేవ్ షా, రోహన్ జైట్లీ, అభిషేక్ దాల్మియా వంటి కీలక వ్యక్తులు పాల్గొన్నారు. బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ (క్యాబ్) అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ, కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్ ప్రసాద్ కూడా హాజరయ్యారు.ఋ

# సెమీస్‌కు చేరిన ఇండియా.. ఆసిన్ గేమ్స్ 2026లో జపాన్ చిత్తు




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియన్ గేమ్స్ 2026క్వార్టర్ ఫైనల్ లో ఇండియా సూపర్ డూపర్ పర్ఫామెన్స్ తో జపాన్ ను మట్టికరిపించింది. వాళ్ల దేశంలో వాళ్లనే చిత్తు చేయడం డిఫెండింగ్ చాంపియన్ ఇండియాకు థ్రిల్లింగ్ విక్టరీ. 2026 సెప్టెంబర్ 18న జరిగిన టీ20 మ్యాచ్ లో 19.5 ఓవర్లలో కేవలం 57 పరుగులు మాత్రమే చేసి ఢీలా పడిపోయింది జపాన్.

భారత మహిళల బౌలింగ్ కు జపాన్ పరుగులు తీయడానికి చాలా తీవ్రంగా శ్రమించినా లాభం లేకుండా పోయింది. చరణీ నాలుగు వికెట్లు తీసి జపాన్ బ్యాటర్లను ముప్పు తిప్పలు పెట్టింది. మరోవైపు షఫాలీ వర్మ రెండు వికెట్లు, దీప్తి శర్మ, శ్రేయాంక పాటిల్ చెరో వికెట్ తీయటంతో జపాన్ బ్యాటర్లు పరుగులు తీయలేకపోయారు. 57 రన్స్ చేసి 19.5 ఓవర్లలో ఆలౌట్ అయ్యారు. జపాన్ విధించిన స్వల్ప టార్గెట్ ను కేవలం 5 ఓవర్లలోనే ఊదేశారు హార్మన్ సేన. షఫాల్ వర్మ 15 బంతులలో 40 రన్స్ మెరుపు ఇన్నింగ్స్ తో సునాయాసంగా మ్యాచ్ గెలిచారు. 5వ ఓవర్లో షఫాలీ వరుసగా 4,4 సాధించగా, ఆ తర్వాత రిచా ఘోష్ ఫోర్ కొట్టి స్ట్రైక్ రొటేట్ చేసింది. దీంతో స్ట్రైక్ లోకి వచ్చిన షఫాలీ వర్మ.. సిక్స్ తో ఇన్సింగ్స్ పూర్తి చేసింది. దీంతో ఇండియా 8 వికెట్ల తేడాతో మ్యాచ్ గెలిచి ఆసియన్ గేమ్స 2026 సెమీస్ కు ఎంటరైంది ఇండియా.

# అతడు ఉండగా చింత ఎందుకు?.. శిఖర్ ధావన్‌తో బంధంపై రోహిత్ శర్మ




**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, తన ఓపెనింగ్ భాగస్వామి శిఖర్ ధావన్‌తో తనకున్న ఆత్మీయ అనుబంధాన్ని గుర్తుచేసుకున్నాడు. 'ఫ్యామిలీ ఫుల్ హౌస్ విత్ రోహిత్ శర్మ' అనే కార్యక్రమంలో పాల్గొన్న హిట్ మ్యాన్, ధావన్‌ను తన ప్రాణ స్నేహితుడిగా అభివర్ణించాడు. "నా ప్రాణస్నేహితుడు వస్తున్నాడు కాబట్టే ఈరోజు నేను ఇంత ఉత్సాహంగా కనిపిస్తున్నాను" అని రోహిత్ చమత్కరించాడు.ఈ సందర్భంగా నిజమైన స్నేహానికి రోహిత్ శర్మ ఒక చక్కని నిర్వచనం ఇచ్చాడు. "కేవలం మీమ్స్, రీల్స్ పంచుకోవడమే స్నేహం కాదు. డ్రెస్సింగ్ రూమ్ అనుభవాలను, గెలుపోటములను, క్లిష్ట పరిస్థితులను, మైదానంలో ఓపెనింగ్ బాధ్యతలను పంచుకోవడమే నిజమైన స్నేహం" అని ఆయన అన్నాడు. జూనియర్ స్థాయి నుంచే తామిద్దరం కలిసి పోటీ క్రికెట్ ఆడటంతో తమ మధ్య ఇంతటి బలమైన బంధం ఏర్పడిందని వివరించాడు.

ధావన్‌తో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించే సమయంలో తనపై ఎలాంటి ఒత్తిడి ఉండేది కాదని రోహిత్ తెలిపాడు. "శిఖర్‌తో ఆడుతున్నప్పుడు నాపై ఒత్తిడి తగ్గుతుందని ఎప్పుడూ భావించేవాడిని. ఎందుకంటే అతను ఆ ఒత్తిడిని తనపైకి తీసుకుని, నా వరకు రాకుండా చూసేవాడు. అందుకే నేను ఎప్పుడూ 'శిఖర్ ఉండగా చింత ఎందుకు' అని అనుకుంటాను" అని రోహిత్ పేర్కొన్నాడు. భారత క్రికెట్ చరిత్రలో అత్యంత విజయవంతమైన ఓపెనింగ్ జోడీలలో ఒకటిగా నిలిచిన వీరిద్దరి స్నేహం, క్రికెట్ ప్రయాణాన్ని ఈ ఎపిసోడ్ ఆవిష్కరించింది.



సాంప్రదాయక అందంతో ఆకట్టుకుంటున్న సీరత్ కపూర్

# ట్రెండ్ షిఫ్ట్: క్రూరత్వం నుంచి డివోషన్ వైపు!



గ్లామర్ రంగంలో ట్రెండ్ ఎంత వేగంగా మారుతుందో చెప్పడానికి నేటి సినిమా పరిశ్రమ సరళి చక్కటి ఉదాహరణగా నిలుస్తోంది. ఒకవైపు కిల్, యానిమల్ వంటి చిత్రాలు తెరపై హింసను, మునుపెన్నడూ లేని క్రూయాల్టీని ప్రదర్శించి బాక్సాఫీస్ వద్ద సంచలనాలు సృష్టించగా.. అడల్ట్ కంటెంట్ చిత్రాల జోరు కూడా బాలీవుడ్‌లో విపరీతంగా పెరిగింది. ఒకప్పుడు ఏదైనా బోల్డ్ పాయింట్ కోసం చాలా అరుదుగా వాడే -ఏ- సర్టిఫికేట్ ట్రెండ్..ఇప్పుడు దర్శకనిర్మాతలకు ఒక గుడ్డి అనుకరణగా మారుతోంది. గతంలో -యానిమల్- సాధించిన భారీ విజయంతో మొదలైన ఈ ధోరణి ఇటీవల మీర్జాపూర్, ధురంధర్ ది రివెంజ్, కాక్‌టెయిల్ 2, అస్సీ వంటి పెద్ద సినిమాలకు పాకి నిర్మాతలు ఈ బాటలోనే నడిచేలా చేసిందని విశ్లేషణలు వచ్చాయి. ఈ ట్రెండ్‌లో భాగంగానే సెప్టెంబర్ 18న విడుదలైన -దైరా-, -వైబ్- సినిమాలు కూడా సెన్సార్ బోర్డు నుంచి -ఏ- సర్టిఫికేట్ సొంతం చేసుకుని అందరినీ ఆశ్చర్యపరిచాయి. ప్రముఖ దర్శకురాలు మేఘనా గుల్జార్ తెరకెక్కించిన ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ -దైరా- చిత్రం సెప్టెంబర్ 11నే సెన్సార్ పూర్తి చేసుకుని 2 గంటల 23 నిమిషాల నిడివితో ఏ సర్టిఫికేట్ దక్కించుకుంది. ఇందులో కరీనా కపూర్ ఖాన్ డీసీపీ అజూనీ కోహ్లీగా, పృథ్వీరాజ్ సుకుమారన్ డీసీపీ రామన్ కుమార్‌గా నటిస్తున్నారు. ఒక అమ్మాయి కిడ్నాప్, అఘాయిత్యం, హత్య నేపథ్యంలో సాగే ఈ కథలో జువెనైల్ చట్టాలు, ఎన్‌కౌంటర్ల చుట్టూ ఉన్న సున్నితమైన వివాదాలను చర్చించనున్నారు. ఇది నటి కరీనా కెరీర్‌లో ఏడో -ఏ- రేటెడ్ సినిమా కావడం మరో విశేషం.

అలాగే కునాల్ ఖేము దర్శకత్వంలో తెరకెక్కిన -వైబ్- చిత్రం కూడా 2 గంటల 25 నిమిషాల రన్‌టైమ్‌తో సెన్సార్‌ను పూర్తి చేసుకుని -ఏ- సర్టిఫికేట్ పొందడం గమనార్హం. ఇందులో ప్రీతి జింటా కీలక పాత్రలో నటిస్తుండగా.. మొదట ఇదొక ఫన్ ఎంటర్‌టైనర్‌గా ప్రచారం జరగడంతో చివరికి దీనికి అడల్ట్ సర్టిఫికేట్ రావడం ప్రేక్షకులకు షాకిచ్చింది. ఇలా రొమాంటిక్, క్రైమ్, వయొలెంట్ జోనర్లలో అడల్ట్ సినిమాలే సర్వవ్యాప్తంగా మారుతున్నాయని భావిస్తున్న తరుణంలో ఇండస్ట్రీలో మరో భారీ ఊహించని మార్పు చోటు చేసుకుంటోంది. కేవలం బోల్డ్ - వైలెంట్ సినిమాలకే కాకుండా డివోషనల్ చిత్రాలకు కూడా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారనే వాస్తవం క్రమంగా నిరూపణ అవుతోంది.ప్రస్తుతం గ్లామర్ - కమర్షియల్ రంగంలో డివోషనల్ సినిమాల హవా క్రమంగా పెరుగుతోంది. -హనుమాన్-, -మహావతార్ నరసింహా-, -హనుమాన్ అంశ్- వంటి చిత్రాల ఘన విజయం అందించిన స్ఫూర్తితో ఇప్పుడు వారణాసి, రామాయణం వంటి భారీ ప్రాజెక్ట్‌లతో పాటు పలువురు ఆధ్యాత్మిక గురువుల బయోపిక్‌లు, పౌరాణిక నేపథ్య చిత్రాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్నాయి. ఇవన్నీ కేవలం భక్తి భావానికి మాత్రమే పరిమితం కాకుండా.. ఆధునిక సాంకేతిక హంగులు, భారీ విజువల్ ఎఫెక్ట్స్ .. కమర్షియల్ హంగులను అద్దుకుని వస్తుండటంతో ప్రేక్షకులలో వీటిపై అంచనాలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి.ఈ పరిణామాలు గ్లామర్ రంగంలో ప్రేక్షకుల అభిరుచులు ఏ స్థాయిలో మారుతున్నాయో స్పష్టం చేస్తున్నాయి. ఒకవైపు హింసాత్మక కథలు, అడల్ట్ కంటెంట్ సినిమాలతో బాక్సాఫీస్‌ను షాక్ ఇస్తున్న మేకర్స్.. మరోవైపు దేశవ్యాప్తంగా ఉన్న సాంస్కృతిక, ఆధ్యాత్మిక సెంటిమెంట్లను క్యాష్ చేసుకునేందుకు భారీ డివోషనల్ సినిమాల వైపు పరుగులు పెడుతున్నారు. మొత్తానికి కంటెంట్ ఏదైనా సరే ప్రేక్షకుల నాడిని పట్టుకుని.. కమర్షియల్ హంగులతో తెరకెక్కిస్తే అది ఏ జోనర్ అయినా సరే అఖండ విజయాలను సాధించగలదని నేటి ట్రెండ్ నిరూపిస్తోంది.



రాశీ ఖన్నా అప్రయత్న మైన ఆకర్షణను నిర్వ చించింది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com